ప్రజాశక్తి
సోమవారం 14 నవంబర్ 2022



‘ముద్ద చర్మ వ్యాధి’పై ఆందోళన వద్దు

- ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేయించండి
- ఆరోగ్య పరిస్థితులపై పశు విజ్ఞాన బడుల్లో సంప్రదించండి
- పశుసంవర్ధక శాఖ జెడి రామచంద్రయ్య

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్



మానవులకు కరోన మహమ్మారి వైరస్ ఎంత నష్టాన్ని చేకూర్చిందో అందరికి తెలుసు అలాంటి వైరస్ ఇప్పుడు పశువుల ప్రాణాలకు ముప్పుగా ఉంది. ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్) వల్ల పశువుల ప్రాణాలకు ముప్పుగా మారింది. ఈ వైరస్ లక్షణాలు, సమస్యలు, పరిష్కరాలు, నివారణ చర్యలపై పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

జిల్లాలో ఎలాంటి పశువులకు ముద్ద చర్మ వ్యాధి సోకింది. ఎన్ని పశువులకు సోకింది?

జెడి : జిల్లాలో అన్ని మండలాల్లో దాదాపు ముద్ద చర్మవ్యాధి విస్తరించింది. ఇది గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలలో ఎక్కువగా ఉంది. ఇది తెల్ల పశువులకు మాత్రమె సోకుతుంది. జిల్లాలో తెల్ల పశువులు 2 లక్షల 35 వేల పశువులున్నాయి. వీటిల్లో కొన్నింటికి మాత్రమే సోకింది. ఇంకా పూర్తి జాబితా సిద్ధం చేస్తున్నాం. అంత తీవ్రత జిల్లాలో లేదు.

నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జెడి : ఈ చర్మ వ్యాధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జిల్లాకు 2 లక్షల 6 వేల డోసుల టీకాలు వచ్చాయి. ఆ టీకాను ఇప్పటిదాకా లక్ష ఎనభై వేల పశువులకు వేశాము. టీకా వేసిన పశువులకు వ్యాధి తీవ్రత తక్కువగా ఉంది. అన్ని పశువులకు టీకాను వేసేలా చర్యలు తీసుకున్నాం.

ఇప్పటి దాకా పశువుల మరణాలు నమోదు అయ్యాయా?

జెడి : జిల్లాలో కల్లూరు, ఎమ్మిగనూరు, ఆస్పరి, కోసిగి మండలాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. పశువుల రక్త నమూనాలు పరీక్షించగా నిర్ధారణ అయ్యాయి. తులిశపురం, సకినేనిపల్లి, నాయకల్లు, వామసముద్రం, చింతలపల్లి, గుండ్రేవుల గ్రామాల్లో నిర్ధారణ జరిగింది. అన్నిటికీ వ్యాక్సిన్‌లు, మందులు అందించాము. కొన్నింటికి వ్యాధి తీవ్రత తక్కువగా ఉండటం వల్ల వెంటనే వ్యాధి తగ్గింది.

వ్యాధి తీవ్రత ఎలా ఉంటుంది. వ్యాధి మిగతా పశువులకు సంక్రమిస్తుందా?

జెడి : ఈ వ్యాధి ప్రభావంతో పశువులకు ఒళ్ళంతా దద్దుర్లు వస్తాయి. అత్యధికంగా వేడి ఉంటుంది. ముక్కు నుండి చీమీడి వస్తుంది. శరీరం లోపల అన్ని భాగాల్లో దద్దుర్లు వస్తాయి. అందువల్ల పశువులు మరణించే అవకాశం ఉంటుంది. ఎక్కువగా ఆవు దూడల మరణలున్నాయి. ఒక పశువు నుండి ఇంకో పశువుకు వచ్చే అవకాశం ఉంది. డాక్టర్లు కూడా వ్యాధి పశువుకు వైద్యం అందించాక మిగతా పశువులకు తాకితే ఆ పశువుకు కూడా వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి ఉన్న పశువులు మిగతా పశువులతో కలపకూడదు.

లంపీ స్కిన్ నివారణకు రాష్ట ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి?

జెడి : పశువుల వైద్యం కోసం మెడిసిన్‌కు 10 లక్షల మందులకు నివేదిక పెట్టాము. అన్ని రకాల టీకాలకు అనుమతులు ఇచ్చారు. జిల్లాలో ప్రతి పశు విజ్ఞాన బడుల ద్వారా ఇప్పటిదాకా 196 అవగాహన సదస్సులు నిర్వహించి పశు రైతులకు పూర్తి స్థాయిలో నివారణ చర్యలు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

మరణించిన పశువులకు నష్టపరిహారం అందిస్తారా?

జెడి : ఇప్పటిదాకా మరణాలు ఎక్కువ జరగలేదు. ఒకసారి పశువుకు 25 వేల రూపాయలు ఇస్తారు. డాక్టర్ ద్వారా పోస్టుమార్టం నివేదిక సమర్పించాలి. ఒంగోలు, జెర్సీ, ముర్రా జాతి పశువులకు 30 వేలు, నాటు పశువులకు 15 వేల రూపాయల నష్టపరిహారం అందుతుంది. మరణించిన పశువుల పూర్తి నివేదికను సంబంధిత డాక్టర్ల ద్వారా నమోదు చేయించాలి.

రైతులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు..?

జెడి : ప్రతి రైతు కూడా పశువులకు టీకా వేయించాలి తద్వారా వ్యాధి తీవ్రత తగ్గుతుంది. డాక్టర్ల సలహాలు పాటించాలి. వ్యాధి నిర్ధారణ జరిగిన పశువులకు ఎప్పటికప్పుడు వైద్యం అందేలా జాగ్రత్తలు తీసుకోవాలి. రైతులు అధైర్య పడవద్దు ప్రతి పశువుకి డాక్టర్లు వైద్యాన్ని అందిస్తారు. దగ్గరలో ఉండే ఆర్బికెల్లో పశువుల డాక్టర్లు, గోపాల మిత్రాలు, పశు వైద్య ఆసిస్టెంట్లకు చూపించి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మరణించిన పశువుల పోస్టుమార్టం నిర్వహించుకునేలా జాగ్రత్తలు పాటించాలి. పశు రైతులు అప్రమత్తంగా ఉండాలి.



నేటి బాలలే రేపటి పౌరులు

- నేడు బాలల దినోత్సవం

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

మనకు చాలా మంది దేశ నాయకులుండగా జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజునే బాలల దినోత్సవంగా ఎందుకు జరుపుకుంటామో తెలుసా... పిల్లలంటే ఆయనకు చాలా చాలా ప్రేమ కాబట్టి..! నెహ్రూ మన దేశానికి మొదటి ప్రధానమంత్రి. ఆ పదవిలో ఉండే వారికి ఎన్నో బాధ్యతలుంటాయి. తీరిక అస్సలే ఉండదు. ఆయన మాత్రం అంత పని ఒత్తిడిలోనూ ఎలాగోలా వీలు చేసుకొని పిల్లలతో మాట్లాడేవారు. పిల్లలంతా ఆయనను ప్రేమగా ‘చాచా’ అని పిలిచేవారు. నెహ్రూకు ఒకే ఒక్క కుమార్తె. ఆమే ఇందిరాగాంధీ. స్వాతంత్ర్యం కోసం నెహ్రూ పోరాటం చేసినప్పుడు ఆంగ్లేయులు ఆయనను ఎన్నోసార్లు జైల్లో పెట్టారు. తన ముద్దుల కుమార్తె ఇందిరకు ఆయన ఎప్పుడూ దూరంగానే ఉండాల్సి వచ్చేది. నెహ్రూ ఎంతో బాధపడేవారు. ఇందిర తన దగ్గరే ఉంటే ఏమేం చెప్పాలనుకునేవారో వాటన్నిటినీ ఉత్తరాల్లో రాసేవారు. ఇందిర ఆ ఉత్తరాలను చదివి భద్రపరిచి తండ్రి చెప్పినట్టే నడుచుకునేవారు. నెహ్రూ కోటుపై ఎర్ర గులాబీ పెట్టుకోవడం ఆయనకు ఎలా అలవాటైందంటే... ఒకరోజు మీలాంటి ఓ చిన్నారి ఆయనకు గులాబీని బహుమతిగా ఇస్తే కోటుకు పెట్టుకున్నారు. అదిచూసి ఆనందంతో నవ్విన చిన్నారి అరవిరిసిన గులాబీ ఆయనకు ఒక్కలాగే కనిపించాయట. తనకు అంత ఇష్టమైన పిల్లల గుర్తుగా... ఆ



తర్వాత నుంచి రోజూ కోటుపై గులాబీ పెట్టుకోవడం ఆయనకు అలవాటైందని చెబుతుంటారు. సెలవు రోజుల్లో నెహ్రూ పిల్లలను తన నివాసానికి పిలిచి మిఠాయిలు పంచేవారు. కబుర్లు చెప్పేవారు. పిల్లలు చాచాకు ఇష్టమైన గులాబీలను బహుమతిగా ఇచ్చేవారు. ఓసారి జపాన్‌కు చెందిన బాలలు ఏనుగు కావాలని చాచాకు ఉత్తరం రాశారు. వెంటనే ఆయన వారికొక ఏనుగును పంపించి, ‘భారతదేశంలోని పిల్లలందరి తరుపునా మీకు ఈ కానుకను పంపిస్తున్నా’ అని ఉత్తరం రాస్తే వారెంతో సంతోషించారట. ఆ ఏనుగు రెండు దేశాల మధ్య స్నేహాన్ని పెంచింది. పిల్లలంతా బడికి వెళ్లాలనేది చాచా కోరిక. ఓసారి బాలల సినిమా చూసిన చాచా అందులో నటించిన ఏడేళ్ల పాపాయిని మెచ్చుకుంటూ షేక్‌హ్యాండ్ ఇచ్చారు. ఆ పాపకు తిరిగి ‘థ్యాంక్స్’ చెప్పడం కూడా రాలేదు. చాచాకు సందేహం వచ్చి ‘పాపను బడికి పంపడం లేదా’ అని వాళ్ల అమ్మను అడిగారు. లేదని చెప్పేసరికి, ఆమెపై కోప్పడి, పాపను వెంటనే బడిలో చేర్పించమని చెప్పారు. ఓసారి ఢిల్లీలో స్కూల్ పిల్లలు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ప్రధాని నెహ్రూను కూడా ఆహ్వానించారు. ఆయన అక్కడ ఒక ఆట కూడా ఆడారు. గోడపైన తోకలేని ఏనుగు బొమ్మను అతికించారు పిల్లలు. దాని దూరం నుంచి చూశాక కళ్లు మూసుకొని కాగితపు తోకను ఏనుగు బొమ్మకు అంటించాలి... అదీ గేమ్. నెహ్రూ కూడా గంతలు కట్టుకొని తోక అతికించడానికి ప్రయత్నించారు. అంగుళం దూరంలో అంటించారు. ఆ గేమ్ ఆడినందుకు అక్కడున్న పిల్లాడు రెండు అణాలు ఫీజు అడిగితే నెహ్రూ ముందు ఆశ్చర్యపోయినా, తర్వాత సరదాగా నవ్వేశారట. తన సహాయకులనడిగి డబ్బు ఇప్పించుకొని ఫీజు చెల్లించారట. ఇలా పిల్లలతో చాచాకు ఉన్న అనుబంధం గురించి ఎన్ని విషయాలైనా చెప్పుకోవచ్చు. పిల్లలకు ఎంతో ఇష్టమైన, పిల్లలంటే ప్రాణమైన నెహ్రూ 1964లో కన్నుమూశారు. చిన్నారుల పట్ల ఆయనకున్న ప్రేమానురాగాలను గుర్తుచేసుకోవడానికి ఆ సంవత్సరం నుంచి ఆయన పుట్టినరోజైన నవంబరు 14ను బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

క్రీడా వ్యాపారం ప్రారంభించిన శాప్



ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) క్రీడాకారుల పట్ల శాపంగా మారింది. పేద క్రీడాకారులు క్రీడాసాధనకు అందుబాటులో ఉన్న క్రీడామైదానలను, స్టేడియాలను, ఇండోర్ స్టేడియాలను, స్విమ్మింగ్ పూల్, జిమ్ సెంటర్లను శాప్ ప్రైవేట్ వ్యక్తులకు లీజుకి ఇస్తూ క్రీడలపై ఆదాయం రాబట్టుకోవాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా క్రీడా సంస్థ సుమారు రూ.25 లక్షలను టార్గెట్‌గా పెట్టి వసులు చేస్తుంది. క్రీడా శిక్షణకు క్రీడాకారుల నుండి కాంట్రాక్ట్ కోచ్‌లు, పే అండ్‌ప్లే కోచ్‌లు డబ్బులు వసులు చేయడం దుర్మార్గమైన చర్యగా క్రీడాభిమానులు విమర్శిస్తున్నారు. బడ్జెట్ కేటయించి క్రీడాభివృద్ధికి పాటు పడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో శాప్ ఆధ్వర్యంలోని 52 బ్యాడ్మింటన్, 10 టెన్నిస్ కోర్టులు, 4 స్కేటింగ్ రింగ్‌లను లీజులకు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసి పేద క్రీడాకారులకు తీరని అన్యాయం చేస్తోంది వైసిపి ప్రభుత్వం. ఈ ప్రక్రియ వలన క్రీడాకారులు ఫీజులు చెల్లించలేక క్రీడలకు దూరమయ్యే అవకాశం ఉంది. తద్వారా రాష్ట్రం క్రీడల్లో వెనుకబడే ప్రమాదం ఉంది. నేషనల్ గేమ్స్‌లో పాల్గొన్న 300 మంది క్రీడాకారులకు చివరి నిమిషం వరకూ ఎటువంటి సహాయం అందించకుండా వేధించారు. ఇప్పుడు ఏకంగా పేద క్రీడాకారుల జీవితాలతో గేమ్స్ ఆడుతున్నారు. శాప్‌లో అర్హత, క్రీడలకు సంబంధం లేని వారిని, వయస్సు మీరిన వారిని సలహాదారులుగా పెట్టుకుని అడ్డగోలుగా జీతాలు ఇచ్చి పోషించడానికి లేని అభ్యంతరాలు పేద క్రీడాకారుల విషయంలోనే ఎందుకు వస్తున్నాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. కర్నూలులోని జోహారాపురం షటిల్ ఇండోర్ స్టేడియాన్ని రూ.50 లక్షలకు లీజ్‌కు ఇచ్చేసారు. స్విమ్మింగ్ పూల్, ఇన్‌డోర్ స్టేడియంలను లీజ్‌కు ఇచ్చే యోచనలో ఉంది. ఏకంగా కర్నూలు స్టేడియాన్ని తాకట్టు పెట్టినట్టు సమాచారం. ప్రభుత్వ బడ్జెట్‌ను కేటాయించి క్రీడాభివృద్ధికి పాటు పడాల్సిన ప్రభుత్వ క్రీడలపైనా వ్యాపారం మొదలెట్టింది. ఇది ఇలా ఉండగా జగన్ అన్న స్పోర్ట్స్ క్లబ్స్ అనే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను నిర్వహించాలని సూచించింది. ఇటీవలే జిల్లా కలెక్టర్ దీని బ్రోచర్ కూడా విడుదల చేసారు. నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించేందుకు ఈనెల 10న ఏర్పాట్లు చేయగా పాల్గొనేందుకు క్రీడాకారులు రాక పోవడంతో స్టేడియం వెలవెల పోయింది. జిల్లాలో క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రత్యామ్నాయం విఫలమైందని క్రీడా విశ్లేషకులు అంచనా. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు వసూళ్ల ఆపి బడ్జెట్ కేటాయింపులు చేసి క్రీడాభివృద్ధికి పాటు పడాలని క్రీడాకారులు, క్రీడా సంఘాలు కోరుతున్నాయి.



కర్నూలు స్టేడియం



చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, నాయకులు

చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టండి

- ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఓర్వకల్లు మండలం నన్నూరు బిల్కులవాగులో దెబ్బతిన్న చెక్ డామ్‌ను ఎపి రైతు సంఘం, సిపిఎం బృందం ఆదివారం పరిశీలించింది. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న, సిఐటియు మండల అధ్యక్షులు జి.శ్రీధర్, రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి మధుసూదన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల సహాయ కార్యదర్శి మల్లేష్ లు పాల్గొన్నారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ నన్నూరు సమీపంలోని బిల్కులవాగులో నాసిరకంగా నిర్మించిన చెక్ డ్యామ్ పగిలిపోయి చుక్క నీరు నిలవడం లేదన్నారు. ఈ డ్యామ్ వల్ల అనేక మంది రైతులు మందుల పిచికారి తదితర వాటికి నీళ్ల ఉపయోగపడేవని,గొర్రెలు మేకలు పశువులకు తాగేందుకు నీళ్ల ఉండేవని డ్యామ్ పగిలిపోవడంతో రైతులు, గొర్రెల కాపరులు, పశువుల కాపరులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే ఇలాంటి డ్యామ్‌లు నన్నూరు గ్రామంలో అనేకం ఉన్నాయన్నారు. అన్ని శిథిలావస్థకు చేరి నీరు నిల్వ ఉండటం లేదని, డ్యాములన్నింటి నిర్మాణం పూర్తి చేసి రైతులు, ప్రజలకు, గొర్రెల కాపరులకు ఉపయోగపడే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు మాసుంబాష, బషీర్, స్వాములు పాల్గొన్నారు.

మంత్రి ఆది మూలపు సురేష్‌కు డిప్యూటీ మేయర్ పరామర్శ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను కర్నూలు నగర డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక శనివారం పరామర్శించారు. మంత్రి శ్రీ ఆదిమూలపు సురేష్ మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న విషయం తెలుసుకొని హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసి సిద్ధారెడ్డి రేణుక పరామర్శించారు. మంత్రిని పరామర్శించిన వారిలో పెద్దపాడు వైసిపి నాయకులు రంగారెడ్డి తదితరులు ఉన్నారు.



మంత్రి ఆదిమూలపు సురేష్‌కు పరామర్శిస్తున్న డిప్యూటి మేయర్ సిద్ధారెడ్డి రేణుక



రోడ్డును పరిశీలిస్తున్న పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు

లక్షలు ఖర్చు చేసిన రోడ్లు గుంతల మయమే

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రూ .20 లక్షల ఖర్చుతో రోడ్డు మరమ్మతులు చేస్తే 60రోజులకే గుంతలు పడుతున్నాయి. పట్టణ పౌరసంక్షేమ సంఘం ప్రతినిధి బృందం పర్యటనలో నాసిరకం రోడ్డు నిర్మాణం బయటపడ్డాయని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ.పుల్లారెడ్డి అన్నారు. రేడియో స్టేషన్ సమీపంలోని రిచ్‌మండ్ కాలనీకి వెళ్లే రోడ్డు రూ.20 లక్షలతో మరమ్మతులు చేయగా 60 రోజులకే గుంతలు పడ్డ రోడ్డును ఆదివారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందంపరిశీలించింది. సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, పి.ఇక్బాల్ మాట్లాడుతూ నాసిరకం పనులపై గతంలో అధికారుల దృష్టికి తెచ్చినా వారు స్పందించనందువల్ల రూ.కోట్లు ప్రజాధనం వృధా అవుతుందన్నారు. రిచ్‌మండ్ కాలనీకి గతంలో వేసిన మెటల్ రోడ్డు గుంతలు బడి వర్షకాలంలో అనేకమంది స్థానికులు కిందపడి గాయాల పాలయ్యారు. ఇది గమనించిన అధికారులు రూ.20 లక్షలతో మెటల్ రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు మంజూరు చేశారు. సంబంధిత మున్సిపల్ ఇంజనీర్ల పర్యవేక్షణ లేనందువల్ల రు.లక్షల ప్రజాధనం వృధా అయిందన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పనులపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో వెంకట్ రెడ్డి, అనిల్, గౌడ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్



ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి కర్నూలు నియోజకవర్గ ఇంచార్జి టిజి.భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని 48వ వార్డు పరిధిలోని రోజా దర్గా సమీపంలో షేర్‌షా సూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. టిజి భరత్ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాల్లో తమ ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యం పట్ల ఎవ్వరూ నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేసి ప్రజాసేవ చేస్తున్న షేర్‌షా సూరి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులను భరత్ అభినందించారు. ఈ వైద్యశిబిరంలో 300 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ట్రస్టు ఛైర్మన్ మస్సూర్ అలీఖాన్, శాంతిరాం కంటి వైద్యశాల ప్రతినిధులు సర్దాజ్ ఖాద్రి, దిలీప్ కుమార్, తేజశ్రీ, ట్రస్టు సభ్యులు ఖాన్ బ్రదర్స్, సద్దాం, రఫిక్, వారీష్, సిరాజ్ పాల్గొన్నారు.

జానపద కళ ప్రపంచానికే ఆదర్శం : డిఎస్‌పి

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

జానపదకళ ప్రపంచానికే ఆదర్శమని కరూలు డిఎస్‌పి మహేష్ అన్నారు. ఎస్‌వి సుబ్బారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 21వ జాతీయస్థాయి సాంస్కృతిక మేళాలో భాగంగా కృష్ణానగర్ రైల్వే గేటు సమీపంలోని శ్రీలక్ష్మీ ఫంక్షన్ హాలులో జరిగిన జాతీయ స్థాయి జానపదనృత్య పోటీలు, జాతీయస్థాయి శాస్త్రీయ సంగీత పోటీలు,జాతీయస్థాయి సమాచార హక్కు చట్టం అంశంపై వ్యాసరచన పోటీలు, జాతీయస్థాయి జానపద పాటల పోటీలను డిఎస్‌పి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. ఎస్‌వి.సుబ్బారెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పల్లె సాంప్రదాయ నృత్యాలు భారతీయ సంస్కృతికి సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. త్వరలో ఎస్‌వి.సుబ్బారెడ్డి ఫౌండేషన్, అసోసియేషన్ ఆఫ్ అలియాన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి సైన్స్ క్విజ్ ఛాంపియన్షిప్ పోటీలను నిర్వహించను న్నామన్నారు. ఎస్‌వి సుబ్బారెడ్డి ఫౌండేషన్ అధ్యక్షులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడారు. సమాచార హక్కు చట్టంపై న్యాయవాది రవికుమార్ , షరీఫ్, రమణయ్య, శివయ్య, లక్ష్మీ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌వి. సుబ్బారెడ్డి ఫౌండేషన్ కార్యదర్శి రాయపాటి నాగలక్ష్మి, నైస్ చంద్ర సేవా సంస్థ సభ్యులు, వ్యాఖ్యాత చంద్రకంటి మద్దయ్య,తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన గోడ పత్రికలను విడుదల చేశారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

మధుమేహం మెటబోలిక్ డిసార్డర్

నేడు అంతర్జాతీయ మధుమేహ దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మధుమేహ వ్యాధి అనేది అంటు వ్యాధి కాదు. ఇది హృదయ సంబంధ వ్యాధుల కారణంగా మరణానికి ప్రధాన కారణం కావచ్చు. మూత్రపిండాలు పనితీరు దెబ్బతింటుంది. అంతేకాకుండా అంధత్వం కూడా ఏర్పడుతుంది. ఈ వ్యాధిపట్ల ప్రజల్లో సరైన అవగాహన లేదు. వయస్సుతో సంబంధం లేకుండా వస్తుంది. ఇందుకోసం ప్రజల్లో అవగాహన తీసుకరావడానికి ప్రతి సంవత్సరం నవంబర్ 14న అంతర్జాతీయ మధుమేహ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సంవత్సరం ‘మధుమేహ వ్యాధి గురించి తెలసుకుందాం’ అనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు.

ప్రమాదా కారకాలు: కుటుంబంలో ఎవరికైనా ఈ వ్యాధి ఉండడం, అధిక బరువు, ఊబకాయం, జీవనశైలిలో మార్పులు, అన్యారోగ్యకరమైన ఆహార పదార్థాలు తీసుకోవడం, ధూమపానం, మద్యపానం వంటివి కూడా ప్రమాద కారకాలుగా మారుతున్నాయి. చాలా మందికి ఈ వ్యాధి వారికి ఉన్నట్టు కూడా తెలియదు. వ్యాధిని ముందుగా గుర్తిస్తే అదుపులో పెట్టుకోవడానికి అవకాశం ఉంటుంది.ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా హెల్త్ చెకప్‌లు తప్పనిసరిగా చేయించుకోవాలి. మధుమేహం వ్యాధి రెండు రకాలుగా ఉంటుందని వైద్యులు గుర్తించారు. అందులో ఒకటి టైప్-1, రెండోది టైప్-2గానూ పేర్కొన్నారు.


శరీరంలో చక్కెర నిల్వలు తగ్గడానికి ప్రధాన కారణాలు: ఆహారం సరిగా తీసుకోకపోవడం, ఉపవాసాలు, అనారోగ్యంగా ఉన్నప్పుడు అవసరానికి మించి వ్యాయామం చేయడం. ఇన్సులిన్, యాంటీబయాటిక్, నొప్పి నివారణ మందులు ఎక్కువ మోతాదులో తీసుకోవడం.

లక్షణాలు: అతిగా ఆకలి వేయడం, అతి చెమట, మూర్ఛపోవడం, బలహీనత, ఎక్కువగా గుండె కొట్టుకోవడం, పెదవులు తిమ్మిరి రావడం, చూపు మసకబారడం, తలనొప్పి.

డయాబెటిక్ వల్ల కలుగు సమస్యలు : డయాబెటిక్ వల్ల మన బాడీలో అన్ని అవయవాలుకు ఎఫెక్ట్ చూపుతుంది. ముఖ్యంగా నరాలు దాని వల్ల కాళ్ళ మంటలు వస్తాయి. కంటి చూపు మందగిస్తుంది. దీనిని డయాబెటిక్ రెటినోపతి అంటారు. కిడ్నీలపై కూడా ప్రభావం చూపుతుంది. దీనిని డయాబెటిక్ నెఫ్రోపతి అంటారు. డయాబెటిక్‌ను కంట్రోల్లో ఉంచుకోకపోతే దీనితో పాటు గుండెపోటు , పక్షపాతం కూడా వచ్చే ఆస్కారం ఉంటుంది. డయాబెటిక్ ఉన్న వారికి గాయాలు తగిలితే నయం అవటానికి సమయం పడుతుంది. కాబట్టి గాయాలు అవకుండా చూసుకోవాలి.

మధు మేహం తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కిమ్స్ హాస్పిటల్ కన్సల్టెంట్, డాక్టర్ సి.గోపీనాథ్ రెడ్డి,



కచ్చితమైన ఆహార సమయాలు పాటిస్తూ, సరైన సమయంలో మందులు వాడడం. రక్తంలో చక్కెర నిల్వ స్థితి పెంచేందుకు 3,4 చెంచాల చక్కెర లేదా గ్లూకోజ్ తీసుకోవాలి. రోజు కనీసం 30 నుంచి 45 నిమిషాల పాటు వ్యాయామం చేసి శరీరం బరువు పెరగకుండా చూసుకోవాలి. భోజనానికి అరగంట ముందు మాత్రలు వేసుకోవాలి. కాళ్లల్లో స్పర్శజ్ఞానం పోయిందన్న విషయం చాలాకాలం వరకూ తెలియదు. స్పర్శలేకపోతే ప్రతి ఆరు లేదా మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్ష చేయించాలి.

8కోట్ల మంది మధుమేహ బాధితులు

మెడికవర్ వైద్య నిపుణులు డాక్టర్ సరయు రెడ్డి



ఈ సంవత్సరం డయాబెటిక్ థీమ్ access to diabetes education ఒక మెటబోలిక్ డిసార్డర్. ప్రపంచ మధుమేహ రాజధానిగా భారత్ మారిపోయింది. ప్రస్తుతం మన దేశంలో 8 కోట్ల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు అంచనా. భారత్‌లోని అన్ని రాష్ట్రాలతో పోలిస్తే తెలుగు రాష్ట్రాల్లో ఈ వ్యాధి మరింత అధికం. డయాబెటిక్ ఇన్సులిన్‌ను Frederick G Banting కనుగొన్నారు.



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి - కర్నూలు క్రైం: రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కర్నూలు ఎమ్మెల్యేట ఎం.ఎ.హాఫీజ్ ఖాన్ అన్నారు. కర్నూలు నియోజకవర్గం బి.క్యాంపు 56వ సచివాలయం పరిధిలోని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయనకు వార్డు కార్పొరేటర్ షేక్ అలియా, షేక్‌మొయిన్‌బాషా, స్థానిక వైసిపి నాయకులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సచివాలయాలు ఏర్పాటు చేయడంవల్ల మా సమస్యలు త్వరగా పరిష్కారం అవుతున్నాయని ప్రజలు ఎమ్మెల్యేకు తెలిపారు. హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్నాయో లేదో తెలుసుకోవడం కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అక్బర్‌వలి, బాజీద్, విజయ లక్ష్మి, జమీల, రైల్వే ప్రసాద్, షఫీ, కేదార్‌నాథ్, హకీమ్, అపర్ణబాయ్, మొహమ్మద్, రెహ్మాన్, శివ, రాజు, హనీఫ్, రఫీక్, వినోద్, ఆయా శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయండి : టిడిపి

ప్రజాశక్తి - మద్దికెర : కర్నూలు జిల్లాలో మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఖరారు అయిందని మద్దికెర మండల తెలు గుదేశం పార్టీ నాయ కులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మాజీ జడ్‌పిటిసి రాజన్న యాదవ్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, టౌన్ ప్రెసిడెంట్ గడ్డం రామాంజనేయులు, మాజీ సొసైటీ సింగిల్ విండో ప్రెసిడెంట్ చంద్రశేఖర్ చౌదరిలు కోరారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు ఈ నెల 16న హైదరాబాద్ నుండి ప్రత్యేక విమానంలో ఓర్వకల్ ఎయిర్‌పోర్టుకు చేరుకొని అక్కడి నుండి రోడ్డు గుండా వాహనంలో పత్తికొండకు చేరుకుంటారన్నారు. పత్తికొండలో మాజీ ఉప ముఖ్యమంత్రి కె.యి కృష్ణమూర్తి, ఇంచార్జ్ కెయి శ్యాంబాబు అధ్యక్షతన జరిగే బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

15న జాబ్ మేళా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఈనెల 15న కర్నూలులోని బి.తాండ్రపాడు గ్రామ సమీపంలో టిటిడిసి కేంద్రంలో ఉద్యోగ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సోమశివారెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి , డిఆర్‌డిఎ జాబ్స్ కోఆర్డినేటర్ కిరణ్ సంయుక్తంగా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్ ఇంటర్ డిగ్రీ బి.టెక్ చదివిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి నేతలు

బాబు పర్యటన రూట్ మ్యాప్ పరిశీలన

ప్రజాశక్తి - ఆదోని

మాజీ సీఎం చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా పర్యటన సందర్భంగా రూట్ మ్యాప్‌ను పరిశీలించామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదివారం తెలిపారు. చంద్రబాబు ఈనెల 16న ఆదోనిలో బస చేయనున్న చేకూరి ఫంక్షన్ హాల్ పరిసర ప్రాంతాల్లో సదుపాయాల గురించి వారు ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు మధిర భాస్కర్ రెడ్డి, రామస్వామి నాయుడు, రాహుఫ్, దేవేంద్రప్ప, తదితరులు ఉన్నారు.

టీచర్స్ ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


సమావేశం అయిన టీచర్లు

పట్టణంలో స్థానిక మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఆదోని పురపాలక సంఘం ఉపాధ్యాయులు 2008 డిఎస్సీ ద్వారా 2018 నవంబర్ 10 తేది విధుల్లో చేరిన ఉపాధ్యాయులు 12 సంవత్సరాలు పూర్తి అయినందున ఆత్మీయ సమావేశం ఆదివారం ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని పురపాలక సంఘ పరిధిలో పనిచేస్తూ కర్నూల్ ,నంద్యాల,హిందూపూర్ ప్రాంతాలకు ట్రాన్స్ఫర్ అయిన ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి తో పాటు ఇలాంటి కార్యక్రమాలు చేసుకోవడం వల్ల మరింత ఉత్సాహంతో పనిచేస్తారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీ 2008 ఉపాధ్యాయులు గురు,మల్లి, వీరచంద్ర యాదవ్,బసవరాజు, మహేంద్ర రెడ్డి,రామకృష్ణుడు,జానీ బాషా,జమాల్, బసవరాజు,బి,శ్రీనివాసులు,జి,శ్రీనివాసులు,కవిత,అనిత,సుజాత, అభిధా పాల్గొన్నారు.

విద్యుత్ మోటర్లు బిగింపునకు స్వస్తి పలకాలి

- ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

- ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి రామచంద్రయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



రాష్ట్రంలో రైతులు వినియోగిస్తున్న నీటి మోటర్లకు విద్యుత్ మోటర్లు అమర్చే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వ స్వస్తి పలకాలని, లేనిపక్షంలో ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏఐకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పి. రామచంద్రయ్య పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి అధ్యక్షతన రైతు సంఘం ఏఐకేఎస్ జిల్లా సమితి సమావేశాన్ని న్యూ ఉష ఫ్యామిలీ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.జగన్నాథం మాట్లాడుతూ ఈ సంవత్సరము ప్రారంభంలో సకాలంలో వర్షాలు వచ్చినందున పంటలు విస్తారంగా సాగు చేసినప్పటికి, చేతికి వచ్చే దశలో అధిక వర్షాలతో కుళ్ళిపోవడం జరిగిందన్నారు. పత్తికాయలు రాలిపోయాయి, గులాబి రంగు తెగులు వచ్చిందన్నారు. మిరప పూత రాలిపోయిందనీ, ఉల్లి, వేరుశనగ పంటలకు ఎకరాకు రూ.40 వేల నుండి లక్షా వరకు పెట్టుబడి పెట్టి నష్టపోయారన్నారు. పంటలు అధిక శాతం నష్టము జరుగుతున్న వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు పరిశీలనకు రాకపోవడం దుర్మార్గం అన్నారు. తక్షణమే నష్టపోయిన పంటలను పరిశీలించి, రైతులకు న్యాయమైన నష్టపరిహారము ఇవ్వాల డిమాండ్ చేశారు,. పంటల బీమా పథకం పూర్తి స్థాయిలో వర్తింపచేసి బీమా డబ్బులు వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. ఈ ఖరీఫ్ (2022 సం,,రం) తీసుకొన్న పంట రుణాలు రద్దు చేసి, కేంద్ర పరిశీలన బృందం వచ్చి నష్టపోయిన పంటలను పరిశీలన చేయాలని వారు కోరారు. ఈ జిల్లాలో పెండింగ్లో ఉన్న వేదవతి,గుండ్రేవుల, ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణాన్ని చేపట్టి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శిలు పంపన్న గౌడ్, సత్తన్న, గోపాల్, కారన్న, విరుపాక్షి, చిన్నన్న,జబ్బర్, హనుమంతు, సిపిఐ పట్టణ కార్యదర్శి జి రంగన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్,కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఇక్కడ పర్సెంటేజీ లేనిదే పని జరగదు

- ఎసిబికి పట్టుబడుతున్నా మారని నైజం

- ఆదోని సబ్‌రిజిస్టార్ ఆఫీజులో రోజుకు లక్ష పైగానే పక్క ఆదాయం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని సబ్ రిజిస్టార్ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. కార్యాలయ ంలో పనిచేసే అధికారులతో పాటు సిబ్బందికి కూడా రోజుకు వేల రూపాయల్లో జేబులోకి వెళ్తున్నాయని చర్చ జరుగుతోంది. పట్టణ, పరిసర గ్రామాలలో కొన్ని అధికారికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం, మరికొన్ని ఎలాంటి అనుమతులు లేకుండా వేసిన వెంచర్ల ద్వారా ప్లాట్లు క్రయ,విక్రయాలు జరుగుతూ ఉంటాయి. ఇవి కాకుండా పొలాల్లో కొనుగోలు, స్థిరాస్థి క్రయవిక్రయాలు జరుగుతాయి.

రోజుకు లక్షల పైగానే ఆదాయం

సబ్ రిజిస్టార్ కార్యాలయంలో జరిగే రిజిస్ట్రేషన్‌కు చలనాలు తోపాటు స్టాంపు పేపర్లు, డాక్యుమెంట్ రైటర్లు ఫీజు తోపాటు కార్యాలయ సిబ్బంది కొనుగోలు మొత్తం ఒకటి నుండి రెండు శాతం మేరకు లంచం ఇవ్వాల్సి ఉంటుంది. రోజుకు రూ.కోటి విలువలకు పైబడి స్థిరాస్థి రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఈ ప్రకారం లెక్కేస్తే రోజుకు కార్యాలయ సిబ్బందికి రూ. లక్షలు చేతివాటంగా వస్తుంది. భూములు, ప్లాట్లకు సంబంధించి వివాదాలు ఉంటే అలాంటి వాటి రిజిస్ట్రేషన్‌కు భారీ మొత్తంలో డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎసిబికి పట్టుబడుతున్నా మారని తీరు

ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయం సంబంధించి దశాబ్దం క్రితం ఇద్దరు అధికారులు ఎసిబికి పట్టుబడ్డారు. 2010వ సంవత్సరంలో భూములు కొనుగోలుకు సంబంధించి సబ్ రిజిస్టార్ వెంకటనాముడు


ఆదోని సబ్ రిజిస్టార్ కార్యాలయం

కర్నూలు నగరంలో లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డారు. 2011వ సంవత్సరం కొత్తగా విధులకు వచ్చిన సబ్ రిజిస్టార్ ప్రవీణ్ కుమార్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ప్రవీణ్ కుమార్ ఎసిబికి పట్టుబడ్డ సమయంలో ఎసిబికి పట్టుబడటంలో ఉద్యోగంలో గొప్ప అవకాశాన్ని కోల్పోవల్సి వచ్చింది. ఇటీవల కాలంలో కల్లూరు సబ్ రిజిస్టార్ అధికారిపై వేటు పడింది. అయినా జాగ్రత్త పడటం లేదు. ఈ లంచావ తారులను చూస్తుంటే వారి నైజం మారాలని ఉన్నతాధికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయివేటు వ్యక్తులదే హవా

సబ్ రిజిస్టార్ కార్యాలయ అధికారితో పాటు మరో నలుగురు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు మరో ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులు విధులు నిర్వహిస్తున్నారు. రోజువారి వేతనం ప్రకారం పని చేస్తున్నారు. ప్రతిరోజు అందిన చేతి వాటంతో ప్రయివేట్ వ్యక్తులకు కూడా లంచాలందుతున్నాయని సమాచారం. చేతివాటంలో వచ్చిన డబ్బుతో సబ్ రిజిస్టార్‌కు అగ్ర తాంబూలం అందుతుందనే ఆరోపణలున్నాయి.

తెగిపోయిన జగనన్న కాలనీ రోడ్డు

మరమ్మతులు చేయని అధికారులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ శివారులోని జగనన్న కాలనీ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు తెగిపోయింది. రోడ్డు తెగి నెలలు గడిచిన కనీసం ప్రత్యామ్నాయ చర్యలు కూడా చేపట్టకపోవడంతో అటువైపు వెళ్లేవారు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. పక్క పొలంలో నుండి జగనన్న కాలనీకి రాకపోకలు సాగిస్తున్నారు. తమ పొలంలో రాకపోకలు చేయడం వల్ల పంట దెబ్బతింటుందని రైతు వాపోతున్నారు. ఆదోని రైల్వే గేట్ నుండి జగనన్న కాలనీ వరకు గత ఏడాది క్రితం నిర్మాణం చేశారు సుమారు లక్షల రూపాయలు ఖర్చు చేసి రోడ్డు వేసిన వర్షపు నీటికి కోతకు గురై రోడ్డు చితలావస్థకు చేరుతుందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు బాగుంటే దానపురం నరనాపురం వెళ్లేవారు ఆ రోడ్డు కూడా ప్రయాణం సాగించేవారు. రోడ్డు నిర్మాణంలోనే నాణ్యత ప్రమాణాలు పాటించకపో వడంతోనే తక్కువ కాలంలోనే కోతకు గురైందని పలువురు విమర్శిస్తున్నారు. కనీసం వర్షపు నీళ్ళు వెళ్లేందుకు పల్లపు ప్రాంతంలో మోరి ఏర్పాటు చేయాలన్న కనీస జ్ఞానం కూడా అధికారులు లేకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. జగనన్న కాలనీలో కనీస, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెబుతున్న అధికారులకు రోడ్డు కోతగురై ఉన్న కనిపించడం లేదా అన్నది పలువురు నిలదీస్తున్నారు. కాలనీకి వెళ్ళేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


తెగి ఉన్న రోడ్డు

జగనన్న కాలనీలో కనిపించని ఇళ్ల నిర్మాణాలు

- ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పాలంటూ ప్రశ్నించిన జనసేన

-జగనన్న కాలనీలో ఉద్రిక్తత

- వాగ్వాదం చేసుకుంటున్న జనసేన, వైసిపి

ప్రజాశక్తి - ఆదోని

పేదలందరికీ ఇళ్ల నిర్మాణం చేసి సొంతింటి కల సాకారం చేస్తామని ఇచ్చిన హామీ సీఎం జగన్మోహన్ రెడ్డి నెరవేర్చలేకపోయారని జనసేన ఆదోని నియోజకవర్గ ఇన్చార్జి మల్లప్ప ప్రశ్నించారు. ఆదివారం ఆదోని పట్టణ శివారులోని జగనన్న కాలనీలో నిర్మాణాలను పరిశీలనకై సందర్శించారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి ఐటి విభాగం నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రామాంజనేయులు ఇతరులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఇరువురు మధ్య మాటమాట పెరిగి వాగ్వాదం చోటు చేసుకుంది. పేదలందరికీ ఇల్లు ఇస్తామని అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ ఎక్కడ నిర్మించారో చెప్పాలని మల్లప్ప నిలదీశారు.



నిరసన తెలుపుతున్న జనసేన పార్టీ నాయకులు

సుమారు పదివేల మందికి సరిపడు ఇళ్ల నిర్మానం జరుగుతుందని వైసిపి నాయకులు ఎదురు ప్రశ్నించారు. ఒకరికొకరు నిందించుకోవడంతో ఘటనా స్థలంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మీడియా సభ్యులు కలగజేసుకోవడంతో సమస్య సద్దుమణిగింది. విషయం తెలుసుకున్న టూ టౌన్ సీఐ శ్రీనివాస్ నాయక్ ఘటనా స్థలానికి వెళ్లి ఇరువురికి నచ్చ చెప్పారు. ఈ సందర్భంగా మల్లప్ప మాట్లాడారు. 2022 జూన్ కల్లా రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లు నిర్మించి ఇస్తామని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం జగన్మోహన్ రెడ్డి పేదల సొంతింటి కల ఎప్పుడు తీరుస్తారని నిలదీశారు. గత 15 ఏళ్లుగా పేదలకు ఏ ప్రభుత్వము సొంతింటి కల సాకారం చేయలేదన్నారు. ఇందిరమ్మ ఇల్లు, టిడ్కో గృహ సముదా యము ఇప్పటికీ నిరుపయోగంగా ఉందన్నారు. మరి ఆరు నెలల్లో 20 లక్షల ఇళ్ళు ఏ విధంగా నిర్మిస్తారో వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చెప్పాలని మల్లప్ప డిమాండ్ చేశారు. శాంతియుతంగా కార్యక్రమం నిర్వహించుకునే వారిని అధికార పార్టీ అడ్డుకోవడం సమంజసం కాదన్నారు బెదిరింపులకు భయపడమని ప్రజలు తమ పక్షాన ఉన్నారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రేణువర్మ, రాజశేఖర్, మహేష్, ప్రకాష్, చిరుత రాజశేఖర్, శ్యామ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి : కెవిపిఎస్

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ఈనెల 28, 29న తేదీలలో కర్నూలు నగరంలో నిర్వహించే కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం నాలుగవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి ఆనంద రాజు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కెవిపిఎస్ పోరాట ఫలితంగా ఏర్పడ్డ జస్టిస్ పున్నయ్య నేతృత్వంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పడిందన్నారు. దళితులపై జరుగుతున్న దాడులపై కెవిపిఎస్ పోరాడుతుందన్నారు. డప్పు కళాకారులు, కాటికాపరులు ఇమ్మానియేల్, కర్రెన్న, మల్లికార్జున బాబు, యోహాన్, అల్లప్ప, ఉరుకుంద, తదితరులు పాల్గొన్నారు.


జిమ్ రోడ్డును పరిశీలించిన కౌన్సిలర్

అభివృద్ధి పథంలో ఐదవ వార్డు

ప్రజాశక్తి - ఆదోని

మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ ఐదవ వార్డును అభివృద్ధి పదంలో నడిపిస్తున్నామని వార్డు కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ, ఎల్ఐజీ, ఎమ్ఐ జీ, జ్యోతిర్మయి కాలేజ్ ఏరియా, విజయనగర్ కాలనీ ప్రాంతాలు ఐదో వార్డు పరిధిలో ఉన్నాయన్నారు. గుంతలు పడిన రోడ్డును వార్డులో జిమ్ రోడ్డు నుండి రంజల రోడ్డు సోము హోటల్ వరకు ఏడు మీటర్ల వెడల్పుతో రూ 25 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం చేయించామన్నారు. రోడ్లు, డ్రైనేజ్ కలవాటు నిర్మాణం కోసం కాలనీలో సుమారుగా రూ 65లక్షలు వ్యయం చేయించామన్నారు. ఎన్జీవోస్ కాలనీ మెయిన్ ఎంట్రన్స్ వద్ద ఏడు లక్షలతో రోడ్డు, కల్వర్టు నిర్మాణం జరిగిందన్నారు. జ్యోతిర్మయి కళాశాల వద్ద డ్రైనేజీ ఏర్పాటు కోసం రూ 17 లక్షలు పనులు మొదలయ్యాన్నారు. తమ వార్డులో మున్సిపల్ రామాజల పార్కు, ఎన్జీవోస్ పార్కుల్లో కనీస సదుపాయాల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారన్నారు. వార్డులో పచ్చదనం పెంపొందించే విధంగా మొక్కలు పెంపకం చేయిస్తున్నామన్నారు. ఆహ్లాదకర వాతావరణం ఉట్టిపడేలా పారిశుధ్య పనులు, వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. వార్డులో సుమారుగా కోటి రూ.50 లక్షలతో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణము చేయించామన్నారు. కేకేబి ఫంక్షన్ హాల్ వద్ద డ్రైనేజీ, రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉందని అందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. తమ వార్డులో వైయస్సార్ చేయూత 240, కాపు నేస్తం 23, ఈబీసీ నేస్తం 17, జగనన్న చేదోడు 19, వాహన మిత్ర 27, జగనన్న తోడు 72, వైఎస్ఆర్ పెన్షన్ కానుక 443 మందికి ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. అమ్మఒడి, విద్యా దీవెన, విద్యా కానుకతో మరికొందరు ప్రయోజనం పొందారని వివరించారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, జయమనోజ్ రెడ్డిల సహకారంతో వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు.

పాండవగల్ ఉప సర్పంచి మూకయ్య మృతి

- పార్టీకి తీరని లోటు : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని రూరల్


మూకయ్య (ఫైల్)

మండల పరిధిలోని పాండవగల్ గ్రామ సిపిఎం సీనియర్ నా యకులు, పాండవగల్ ఉప సర్పంచ్ టి.మూకయ్య అనా రోగ్యంతో మృతి చెందారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనే యులు, కే.వెంకటేశ్వర్లు, సిపిఎం ఆదోని మండల కార్యదర్శి కే.లింగన్న, పాండవగల్ గ్రామ సర్పంచ్ ఉమాదేవి పాల్గొని ఆయన మృతదేహానికి పూలమాల వేసి, పార్టీ జెండా కప్పి ఆయనకు నివాళులర్పించారు. అనంతరం సిపిఎం నాయకులు మాట్లాడుతూ మూకయ్య మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. మూకయ్య ప్రజా ఉద్యమాలలో ముందుండి పాల్గొని వారని, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జె.రామాంజనేయులు, వివిధ శాఖా కార్యదర్శులు కే.పాండురంగ, గోవిందు, సీనియర్ నాయకులు ఇస్మాయిల్, చిన్న తాయన్న, హనుమంత్ రెడ్డి, భీమాంజనేయులు, మాజీ వైస్ సర్పంచ్ హనుమంతు పాల్గొన్నారు.

వేదవతి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి: రైతు సంఘం

ప్రజాశక్తి-ఆలూరు



వేదవతి ప్రాజెక్టును 8 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించాలని రైతు సంఘం తాలూకా సీనియర్ నాయకుడు హోతురప్ప డిమాండ్ చేశారు. ఆదివారం ఆలూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అతి వృష్టి, అనావృష్టి కారణంగా రైతులు ప్రతి ఏటా పంట నష్టం జరుగుతుందని అన్నారు. ఆలూరు ప్రాంతానికి సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. నిధుల కొరత వల్ల వేదవతి ప్రాజెక్టు నిర్మాణం పనులు నిలిపి వేయడం తగదన్నారు. ప్రభుత్వ వెంటనే ప్రాజెక్టుల నిర్మాణం పనులు చేపట్టాలన్నారు. వేదవతి ప్రాజెక్టు సామర్థ్యంను తగ్గించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. వేదవతి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 80 వేల ఎకరాల సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఐటియుసి తాలూకా అధ్యక్షులు కురవ శివ, రైతు సంఘం నాయకులు పులి రంగన్న, ఓబులేష్, నాగరాజు, ఈశ్వర్, రామంజి, సుంకప్ప, రాజు, బండప్ప, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు ఇచ్చుకో.. 'టిసి' పుచ్చుకో

- తనుజ డిగ్రీ కళాశాల యజమాన్యం ఇష్టారాజ్యం

ప్రజాశక్తి - హోళగుంద



డబ్బులు ఇచ్చుకో.. టిసి (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్) తీసుకో.. అంటూ తనుజ డిగ్రీ కళాశాల యజ మాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోం ది. పేద విద్యార్థులపై ఫీజుల భారం మోపుతూ ప్రతిదానికి రేటు ఫిక్స్ చేస్తూ సదరు పైకం చెల్లించకపోతే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకో పో అని విద్యార్థులపై కళాశాల యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతోందని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివరాలకు వెళితే.. మండల పరిధిలోని చిన్న హేట గ్రామానికి చెందిన గణేష్ అనే విద్యార్థి 2021 సంవత్సరంలో వనజ కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీలో చేరాడు. కళాశాల యాజమాన్యం ప్రభుత్వం నుండి రావలసిన రాయితీలన్నీ తీసుకుంది. అంతే కాకుండా జగనన్న విద్యా కానుక పైకం సైతం కళాశాల యజమాన్యానికి విద్యార్థి చెల్లించాడు. అయితే విద్యార్థి తన వ్యక్తిగత కారణాలవల్ల వేరొక చోట చేరడానికి ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ ఇవ్వమని అడిగితే రూ.26000 ఇస్తేనే ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ ఇస్తామని కళాశాల యాజమాన్యం వేదిస్తోందని విద్యార్థి గణేష్ పేర్కొన్నాడు. డబ్బులు చెల్లించకపోతే ఇచ్చేదే లేదు.. ఎవ్వరికైనా చెప్పుకోపో అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. కళాశాలకు చెల్లించవలసిన మొత్తం చెల్లించినాను, తనది పేద కుటుంబం అని చెప్పిన కూడా తనపై దుర్భాషలాడి అవమానపరిచార న్నారని విద్యార్థి పేర్కొన్నాడు. సంబంధిత విద్యాశాఖ అధికారులు యాజమాన్యంపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని విద్యార్థి కోరారు. ఈ విషయంపై పాత్రికేయులు తనుజ కాలేజ్ కరస్పాండెంట్ లక్ష్మి నారాయణ రెడ్డిని వివరణ కోరగా.. మూడేళ్లు ఇక్కడే చదవాలని జాయినింగ్ చేసుకునేటప్పుడే చెప్పాము, వేరే కాలేజీలో చేరడం వల్ల కళాశాలకు నష్టం జరుగుతుందని పేర్కొన్నాడు. అందుకే ఫీజు చెల్లించాలని చెబుతున్నామని అన్నారు.

వలస బాట పట్టిన కూలీలు

ఉపాధి పనులు కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి-ఆలూరు

గ్రామాల్లో అధిక వర్షాలు, నకిలీ పత్తి విత్తనాలతో పూర్తిగా నష్టపోయిన రైతులు వలస బాట పడుతున్నారు. బడికి వెళ్తున్న పిల్లలు సైతం తల్లిదండ్రులు తమ వెంట తీసుకెళ్తున్నారు. ఇక్కడ ప్రస్తుతం కూలీలు పనులు అరకొరగా ఉండడంతో తెలంగాణ రాష్ట్రానికి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఆదివారం హోళగుంద మండలం నెరణికి గ్రామానికి చెందిన 30 కుటుంబాలు తెలంగాణ రాష్ట్రంలో పత్తి, మిరప కోత కూలీ పనులు కోసం పిల్లలతో సహ వలస వెళ్లారు. కూలీలకు ఉపాధి పనులు కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. గ్రామంలో ఉపాధి లేక వలసలు పోతున్నామని నెరణికి గ్రామ కూలీలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని కోరుతున్నారు.


వలస వెళ్తున్న వ్యవసాయ కూలీలు

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

- గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్

ప్రజాశక్తి - చిప్పగిరి


మాట్లాడుతున్న అబ్దుల్ రసూల్

మండల కేంద్రమైన చిప్పగిరి గ్రంథాలయంలో సోమవారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్స వాలు నిర్వహి స్తున్నట్టు గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ తెలిపారు. ఆయన మాట్లా డుతూ వారోత్సవాలలో భాగంగా ఈనెల 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు స్మరించుకొనుట, 18న చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, 19న దిశ చట్టం మహిళా సాధికారకతపై చర్చ, 20న గ్రంథాలయాలపై అవగాహన సామూహిక స్వీయ పఠనంతో వారోత్సవాలు, నిర్వహిస్తామన్నారు. మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు మంచి బహుమతులు అందజేస్తామన్నారు. **ఆస్పరి:** మండలంలో సోమవారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం కానున్నాయని గ్రంథాలయ అధికారి విశ్వనాథ్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈనెల 14 నుండి 19వ తేదీ వరకు నిర్వహించే వారోత్సావాల్లో విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు.

కోసిగి అభివృద్ధే ఎమ్మెల్యే ధ్యేయం

- మండల వైసిపి ఇంచార్జీ మురళీ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కోసిగి అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి పాలనా సాగుతోందని, కోసిగి మండల వైసిపి ఇంచార్జీ మురళీమోహన్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం కోసిగిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు మురళీ రెడ్డి శ్రీకారం చుట్టారు. గ్రామ పంచాయతీ నిధులు ద్వారా కోసిగి 6వవార్డులోని పెద్ద మసీదు దగ్గర దగ్గర 2లక్షల రూపాయలతో సిసి రోడ్డుకి గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మతో భూమి పూజ చేశారు. అనంతరం 6వ వార్డు శాంతి నగర్, పెద్దమసీదు, చైతన్య స్కూల్ వరకు 5లక్షల రూపాయలతో నిర్మించిన తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో మేజర్ గ్రామ పంచాయతీ కోసిగి అభివృద్ధి పనుల విషయంలో పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు.

ఈకార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు నాడిగేని నరసింహులు, యంపీపీ లవకుశ ఈరన్న,ఆర్లభండసహకార సంఘం అధ్యక్షుడు మహాంతేష్ స్వామి, మండల నాయకులు మాణిక్య రాజ, హెూళగుంద కోసిగయ్య,మాజీ యంపీపీ యన్ బీమక్క,మాజీ జడ్పీటీసీ మంగమ్మ,నాడిగేని నాగరాజు,హాజీఉస్మాన్,వి వెంకటేష్,బండ్ల గోవిందు, రాజేష్,రహీం,సన్నక్కి ఈరన్న, నాడిగేని తిమ్మక్క,కాంట్రాక్ట్ బసిరెడ్డి,ఎరుకుల లక్ష్మన్న, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న మురళీ మనోహర్ రెడ్డి, తదితరులు

పిహెచ్ఎస్ హైబ్రిడ్‌తో

మిరప పంటలో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - దేవనకొండ

ప్రభాకర్ సీడ్స్ కంపెనీకి చెందిన యశ్వంత్-28 అనే రకం మిరప సీడ్స్‌తో రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని మార్కెటింగ్ మేనేజర్ కిరీటి, సేల్స్ మేనేజర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం నాడు మండల కేంద్రమైన దేవనకొండ గ్రామానికి చెందిన చాకలి హనుమంతు అనే రైతు పొలంలో వెంకట సాయి ట్రేడర్స్ ఆధ్వర్యంలో ప్రభాకర్ సీడ్స్ వారి యశ్వంత్-28 రకం మిరప పంట క్షేత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆశాజనకంగా దిగుబడులు వచ్చిన మిరప పంట క్షేత్ర పరిశీలనకు వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చి పరిశీలించారు. మిరప పంట సాగు, సస్యరక్షణ చర్యలు, ఎరువుల వాడకం, యాజమాన్య పద్ధతులు తదితర అంశాలను రైతులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ సీడ్స్ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ అన్ని రకాల కూరగాయల పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకున్నామన్నారు. యశ్వంత్-28 అనే రకం మిరప పంట తెగుళ్లను తట్టుకునే స్వభావం కలిగి ఉండి ఎకరాకు30 నుండి 40 కింటాల దిగుబడి పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట సాయి ట్రేడర్స్ డిస్ట్రిబ్యూటర్స్ వేణుగోపాలరావు, మిరప పంట క్షేత్ర పరిశీలనకు వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో రైతులు హాజరయ్యారు.


హనుమంతు అనే రైతును సన్మానిస్తున్న కంపెనీ ప్రతినిధులు



అంగన్వాడీ వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక

- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ వరం
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామున్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. రాష్ట్రంలో ప్రతి మహిళకు ప్రభుత్వ పథకాల లబ్ధిని చేకూరుస్తుందని తెలిపారు. రాజకీయంగా కూడా మహిళలకు నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు అనేక ఉన్నత పదవులలో నియమించి బాధ్యతలను అప్పగించినట్లు చెప్పారు. ఇందులో భాగంగానే వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ లాంటి బృహత్తర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తోందన్నారు. ఈ పథకాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందిస్తోందని తెలిపారు. దీంతోపాటు వైఎస్సార్ అమృత హస్తం, మధ్యాహ్న భోజన పథకం, బాలామృతం, వైఎస్సార్ బాల సంజీవని పథకాలు కూడా అమలులో వున్నాయని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలకు నెలలో 25 రోజులపాటు వేడి పాలు, అన్నం, పప్పు, కూరగాయలు, ఆకుకూరలు, గుడ్డు అందజేస్తున్నారని చెప్పారు. టేక్ హెూమ్ న్యూట్రిషన్ కిట్ కింద నెలకు 2 కిలోల మల్టీ గ్రెయిన్ ఆటా, అర కిలో వేరుశనగ చిక్కీ, అరకిలో రాగి పిండి, అరకిలో బెల్లం, అరకిలో ఎండు ఖర్జూరం పంపిణీ చేస్తున్నారని తెలిపారు. 36 నుంచి 72 నెలలలోపు ఉన్న చిన్నారులకు నెలలో 25 రోజులపాటు వేడి అన్నం, పప్పు, కూరగాయలు, ఆకుకూరలతోపాటు 200 మిల్లీ లీటర్ల పాలు, కోడిగుడ్డు, 50 గ్రాముల బాలామృతం లడ్డు తదితర పోషకాహార పదార్థాలు ఇస్తున్నారని చెప్పారు. 6 నుంచి 36 నెలలలోపు ఉన్న చిన్నారులకు టేక్ హెూం న్యూట్రిషన్ కిట్ కింద నెలకు 2.5 కిలోల బాలామృతం, 30 కోడి గుడ్లు, 6 లీటర్ల పాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల నంద్యాల మండలంలోని చాపిరేవుల, కానాలలోని అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లల బరువు, సంబంధిత రిజిస్టర్లను స్వయంగా పరిశీలించామని చెప్పారు. పిల్లలు ప్రతిరోజూ కేంద్రానికి హాజరయ్యేలా చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ మెనూ ప్రకారం క్రమం తప్పకుండా పోషకాహార పదార్థాలు ఇవ్వాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. అంగన్వాడీ సెంటర్ పరిధిలోని రక్తహీనత గల గర్భిణులను గుర్తించి ఐరన్ ఫోలిక్ మాత్రలు ఇవ్వడంతో పాటు బలవర్ధకమైన పోషకాహార పదార్థాలు పంపిణీ చేసి హిమగ్లోబిన్ శాతాన్ని పెంచాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించినట్లు కలెక్టర్ వెల్లడించారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

నేటి బాలలే రేపటి పౌరులు

- నేడు బాలల దినోత్సవం

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

మనకు చాలా మంది దేశ నాయకులుండగా జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజునే బాలల దినోత్సవంగా ఎందుకు జరుపుకుంటామో తెలుసా... పిల్లలంటే ఆయనకు చాలా చాలా ప్రేమ కాబట్టి..! నెహ్రూ మన దేశానికి మొదటి ప్రధానమంత్రి. ఆ పదవిలో ఉండే వారికి ఎన్నో బాధ్యతలుంటాయి. తీరిక అస్సలే ఉండదు. ఆయన మాత్రం అంత పని ఒత్తిడిలోనూ ఎలాగోలా వీలు చేసుకొని పిల్లలతో మాట్లాడేవారు. పిల్లలంతా ఆయనను ప్రేమగా 'చాచా' అని పిలిచేవారు. నెహ్రూకు ఒకే ఒక్క కుమార్తె. ఆమే ఇందిరాగాంధీ. స్వాతంత్ర్యం కోసం నెహ్రూ పోరాటం చేసినప్పుడు ఆంగ్లేయులు ఆయనను ఎన్నోసార్లు జైల్లో పెట్టారు. తన ముద్దుల కుమార్తె ఇందిరకు ఆయన ఎప్పుడూ దూరంగానే ఉండాల్సి వచ్చేది. నెహ్రూ ఎంతో బాధపడేవారు. ఇందిర తన దగ్గరే ఉంటే ఏమేం చెప్పాలనుకునేవారో వాటన్నిటినీ ఉత్తరాల్లో రాసేవారు. ఇందిర ఆ ఉత్తరాలను చదివి భద్రపరిచి తండ్రి చెప్పినట్టే నడుచుకునేవారు. నెహ్రూ కోటుపై ఎర్ర గులాబీ పెట్టుకోవడం ఆయనకు ఎలా అలవాటైందంటే... ఒకరోజు మీలాంటి ఓ చిన్నారి ఆయనకు గులాబీని బహుమతిగా ఇస్తే కోటుకు పెట్టుకున్నారు. అదిచూసి ఆనందంతో నవ్విన చిన్నారి అరవిరిసిన గులాబీ ఆయనకు ఒక్కలాగే కనిపించాయట. తనకు అంత ఇష్టమైన పిల్లల గుర్తుగా... ఆ తర్వాత



నుంచి రోజూ కోటుపై గులాబీ పెట్టుకోవడం ఆయనకు అలవాటైందని చెబుతుంటారు. సెలవు రోజుల్లో నెహ్రూ పిల్లలను తన నివాసానికి పిలిచి మిఠాయిలు పంచేవారు. కబుర్లు చెప్పేవారు. పిల్లలు చాచాకు ఇష్టమైన గులాబీలను బహుమతిగా ఇచ్చేవారు. ఓసారి జపాన్‌కు చెందిన బాలలు ఏనుగు కావాలని చాచాకు ఉత్తరం రాశారు. వెంటనే ఆయన వారికొక ఏనుగును పంపించి, 'భారతదేశంలోని పిల్లలందరి తరుపునా మీకు ఈ కానుకను పంపిస్తున్నా' అని ఉత్తరం రాస్తే వారెంతో సంతోషించారట. ఆ ఏనుగు రెండు దేశాల మధ్య స్నేహాన్ని పెంచింది. పిల్లలంతా బడికి వెళ్లాలనేది చాచా కోరిక. ఓసారి బాలల సినిమా చూసిన చాచా అందులో నటించిన ఏడేళ్ల పాపాయిని మెచ్చుకుంటూ షేక్‌హ్యాండ్ ఇచ్చారు. ఆ పాపకు తిరిగి 'థ్యాంక్స్' చెప్పడం కూడా రాలేదు. చాచాకు సందేహం వచ్చి 'పాపను బడికి పంపడం లేదా' అని వాళ్ల అమ్మను అడిగారు. లేదని చెప్పేసరికి, ఆమెపై కోప్పడి, పాపను వెంటనే బడిలో చేర్పించమని చెప్పారు. ఓసారి ఢిల్లీలో స్కూల్ పిల్లలు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ప్రధాని నెహ్రూను కూడా ఆహ్వానించారు. ఆయన అక్కడ ఒక ఆట కూడా ఆడారు. గోడపైన తోకలేని ఏనుగు బొమ్మను అతికించారు పిల్లలు. దాని దూరం నుంచి చూశాక కళ్లు మూసుకొని కాగితపు తోకను ఏనుగు బొమ్మకు అంటించాలి... అదీ గేమ్. నెహ్రూ కూడా గంతలు కట్టుకొని తోక అతికించడానికి ప్రయత్నించారు. అంగుళం దూరంలో అంటించారు. ఆ గేమ్ ఆడినందుకు అక్కడున్న పిల్లాడు రెండు అణాలు ఫీజు అడిగితే నెహ్రూ ముందు ఆశ్చర్యపోయినా, తర్వాత సరదాగా నవ్వేశారట. తన సహాయకులనడిగి డబ్బు ఇప్పించుకొని ఫీజు చెల్లించారట. ఇలా పిల్లలతో చాచాకు ఉన్న అనుబంధం గురించి ఎన్ని విషయాలైనా చెప్పుకోవచ్చు. పిల్లలకు ఎంతో ఇష్టమైన, పిల్లలంటే ప్రాణమైన నెహ్రూ 1964లో కన్నుమూశారు. చిన్నారుల పట్ల ఆయనకున్న ప్రేమానురాగాలను గుర్తుచేసుకోవడానికి ఆ సంవత్సరం నుంచి ఆయన పుట్టినరోజైన నవంబరు 14ను బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

ముద్ద చర్మ వ్యాధిపై ఆందోళన వద్దు

- ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేయించండి
- ఆరోగ్య పరిస్థితులపై పశు విజ్ఞాన బడుల్లో సంప్రదించండి
- పశుసంవర్ధక శాఖ జెడి రామచంద్రయ్య

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

మానవులకు కరోన మహమ్మారి వైరస్ ఎంత నష్టాన్ని చేకూర్చిందో అందరికి తెలుసు అలాంటి వైరస్ ఇప్పుడు పశువుల ప్రాణాలకు ముప్పుగా ఉంది. ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్) వల్ల పశువుల ప్రాణాలకు ముప్పుగా మారింది. ఈ వైరస్ లక్షణాలు, సమస్యలు, పరిష్కారాలు, నివారణ చర్యలపై పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు..

జిల్లాలో ఎలాంటి పశువులకు ముద్ద చర్మ వ్యాధి సోకింది. ఎన్ని పశువులకు సోకింది?

జెడి : జిల్లాలో అన్ని మండలాల్లో దాదాపు ముద్ద చర్మవ్యాధి విస్తరించింది. ఇది గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలలో ఎక్కువగా ఉంది. ఇది తెల్ల పశువులకు మాత్రమె సోకుతుంది. జిల్లాలో తెల్ల పశువులు 2 లక్షల 35 వేల పశువులున్నాయి. వీటిల్లో కొన్నింటికి మాత్రమే సోకింది. ఇంకా పూర్తి జాబితా సిద్ధం చేస్తున్నాం. అంత తీవ్రత జిల్లాలో లేదు.

నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జెడి : ఈ చర్మ వ్యాధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జిల్లాకు 2 లక్షల 6 వేల డోసుల టీకాలు వచ్చాయి. ఆ టీకాను ఇప్పటిదాకా లక్ష ఎనభై వేల పశువులకు వేశాము. టీకా వేసిన పశువులకు వ్యాధి తీవ్రత తక్కువగా ఉంది. అన్ని పశువులకు టీకాను వేసేలా చర్యలు తీసుకున్నాం.

ఇప్పటి దాకా పశువుల మరణాలు నమోదు అయ్యాయా?

జెడి : జిల్లాలో కల్లూరు, ఎమ్మిగనూరు, ఆస్పరి, కోసిగి మండలాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. పశువుల రక్త నమూనాలు పరీక్షించగా నిర్ధారణ అయ్యాయి. తులిశపురం, సకినేనిపల్లి, నాయకల్లు, వామ సముద్రం, చింతలపల్లి, గుండ్రేవుల గ్రామాల్లో నిర్ధారణ జరిగింది. అన్నిటికీ వ్యాక్సిన్‌లు, మందులు అందించాము. కొన్నింటికి వ్యాధి తీవ్రత తక్కువగా ఉండటం వల్ల వెంటనే వ్యాధి తగ్గింది.



వ్యాధి తీవ్రత ఎలా ఉంటుంది. వ్యాధి మిగతా పశువులకు సంక్రమిస్తుందా?

జెడి : ఈ వ్యాధి ప్రభావంతో పశువులకు ఒళ్ళంతా దద్దుర్లు వస్తాయి. అత్యధికంగా వేడి ఉంటుంది. ముక్కు నుండి చీమిడి వస్తుంది. శరీరం లోపల అన్ని భాగాల్లో దద్దుర్లు వస్తాయి. అందువల్ల పశువులు మరణించే అవకాశం ఉంటుంది. ఎక్కువగా ఆవు దూడల మరణలున్నాయి. ఒక పశువు నుండి ఇంకో పశువుకు వచ్చే అవకాశం ఉంది. డాక్టర్లు కూడా వ్యాధి పశువుకు వైద్యం అందించాక మిగతా పశువులకు తాకితే ఆ పశువుకు కూడా వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి ఉన్న పశువులు మిగతా పశువులతో కలపకూడదు.

లంపీ స్కిన్ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి?

జెడి : పశువుల వైద్యం కోసం మెడిసిన్‌కు 10 లక్షల మందులకు నివేదిక పెట్టాము. అన్ని రకాల టీకాలకు అనుమతులు ఇచ్చారు. జిల్లాలో ప్రతి పశు విజ్ఞాన బడుల ద్వారా ఇప్పటిదాకా 196 అవగాహన సదస్సులు నిర్వహించి పశు రైతులకు పూర్తి స్థాయిలో నివారణ చర్యలు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

మరణించిన పశువులకు నష్టపరిహారం అందిస్తారా?

జెడి : ఇప్పటిదాకా మరణాలు ఎక్కువ జరగలేదు. ఒకసారి పశువుకు 25 వేల రూపాయలు ఇస్తారు. డాక్టర్ ద్వారా పోస్టుమార్టం నివేదిక సమర్పించాలి. ఒంగోలు, జెర్సీ, ముర్రా జాతి పశువులకు 30 వేలు, నాటు పశువులకు 15 వేల రూపాయల నష్టపరిహారం అందుతుంది. మరణించిన పశువుల పూర్తి నివేదికను సంబంధిత డాక్టర్ల ద్వారా నమోదు చేయించాలి.

రైతులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు..?

జెడి : ప్రతి రైతు కూడా పశువులకు టీకా వేయించాలి తద్వారా వ్యాధి తీవ్రత తగ్గుతుంది. డాక్టర్ల సలహాలు పాటించాలి. వ్యాధి నిర్ధారణ జరిగిన పశువులకు ఎప్పటికప్పుడు వైద్యం అందేలా జాగ్రత్తలు తీసుకోవాలి. రైతులు అధైర్య పడవద్దు ప్రతి పశువుకి డాక్టర్లు వైద్యాన్ని అందిస్తారు. దగ్గరలో ఉండే ఆర్బికెల్లో పశువుల డాక్టర్లు, గోపాల మిత్రాలు, పశు వైద్య అసిస్టెంట్లకు చూపించి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మరణించిన పశువుల పోస్టుమార్టం నిర్వహించుకునేలా జాగ్రత్తలు పాటించాలి. పశు రైతులు అప్రమత్తంగా ఉండాలి.



మార్కెట్ యార్డ్ చైర్మన్ పీఠం

ఎవరిని వరించేనో..?

- ఆ మూడు సామాజిక వర్గాలపైనే ఎమ్మెల్యే దృష్టి
- కొత్త వారికి అవకాశం లేనట్టే..

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పోస్టు గత ఏడు మాసాలుగా ఖాళీగానే ఉంది. చైర్మన్‌గా ఎవరు వస్తారనే చర్చ సాగుతూనే ఉంది. ముఖ్యంగా నంద్యాల పట్టణంలో మూడు సామాజిక వర్గాలు బలంగా ఉన్నాయి. దీంతో ఆ సామాజిక వర్గాల వారికే చైర్మన్ గిరి కట్టబెట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి సమాలోచనలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఎప్పుడూ ఆ మూడు సామాజిక వర్గాలేనా... మిగిలిన వారు చైర్మన్ పీఠానికి అర్హులు కారా అనే విమర్శలు కూడా వైసిపి వర్గాల్లో వినిపిస్తున్నాయి.

నంద్యాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఉన్న ఇసాక్ భాషకు వైసిపి అధిష్టానం ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో చైర్మన్ స్థానం ఖాళీ ఏర్పడింది. 2021 మే నెలతో పాలకమండలి పదవి కాలం సైతం ముగిసింది. నూతన పాలకమండలి ఏర్పాటుకు ఎమ్మెల్యే కసరత్తు చేస్తున్నారు. ఈ కసరత్తులో చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో అన్న ఉత్కంఠ పట్టణంలోని ప్రధాన సామాజిక వర్గాల్లో నెలకొంది. నంద్యాల నియోజకవర్గంలోని రాజకీయాల్లో ప్రధానంగా మూడు సామాజిక వర్గాలకే పదవులు దక్కుతున్నాయి. మిగిలిన సామాజిక వర్గాలకు నామమాత్ర పదవులే.. నియోజకవర్గంలో ఆ మూడు సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లు అధికంగా ఉండడంతో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వారికే పదవుల ఎంపికలో అగ్ర పీఠం వేస్తుంటారు. అయితే చైర్మన్ ఎంపికలో ఈ వర్గాల మధ్య సమతుల్యత దెబ్బతినే ఏ నిర్ణయమైనా ఎమ్మెల్యేకు ఇబ్బందిగా మారే పరిస్థితిలు ఉంటాయి. ఈ పరిస్థితుల్లో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎంపిక కరవమంటే కప్పకు కోపం... విడవమంటే పాముకు కోపం ఉన్న చందంగా మారింది. ఈ సామాజిక వర్గాల మధ్య అసంతృప్తి తలెత్తకుండా ఎంపిక చేయాల్సిన బాధ్యత ఉండటంతో ఓ రకంగా ఎమ్మెల్యేకు కత్తి మీద సాములా మారింది. ఇదిలా ఉండగా మరో వైపు చైర్మన్ పదవి ఆశిస్తున్న ఆశావహులు తమదైన శైలిలో అధిష్టానం వద్ద తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. చైర్మన్ ఎంపికలో తలనొప్పులు తలెత్తకుండా అన్ని కోణాల్లో ఆలోచించి ఎంపిక చేయాలన్న సిఎం సూచనల మేరకు ఎమ్మెల్యే పలువురుతో మంతనాలు జరుపుతూ అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అన్నదాతల ఇబ్బందులు తెలిసిన వారై ఉండేలా, వారి శ్రేయస్సుకు చిత్తశుద్ధితో శ్రమించే వారిని చైర్మన్‌గా ఎంపిక చేయడానికి ఎమ్మెల్యే సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అటు పార్టీకి ఇబ్బంది కలగకుండా ఇటు సామాజిక వర్గాల మధ్య సమన్వయం దెబ్బతినకుండా చైర్మన్ పదవికి అభ్యర్థిని ఎంపిక చేయడంలో ఎమ్మెల్యే శిల్పా తన చతురత ప్రదర్శించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆ మూడు సామాజిక వర్గాలకు చెందిన పలువురు నాయకులతో చర్చలు జరపగా చైర్మన్ పీఠం అధిరోహించడానికి కొంతమంది నిరాకరించినట్లు తెలిసింది. ఏదేమైనా రైతన్నల సమస్యలను పరిష్కరిస్తూ, వారి అభివృద్ధికి తోడ్పాటు అందించనున్న అభ్యర్థిని చైర్మన్‌గా ఎంపిక చేయాలని రైతులు కోరుకుంటున్నారు.




టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్ బాషాను సన్మానిస్తున్న ముల్లా శ్యాబుల్

రాష్ట్ర ఉపాధ్యక్షుడుకి ఘన సన్మానం

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణానికి చెందిన ముల్లా శ్యాబుల్‌ను టిడిపి పట్టణ ఉపాధ్యక్షుడిగా తనను ఎంపిక చేసిన సందర్భంగా ఆయన టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్ బాషను ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో అన్సర్ బాషను శాలువ, గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. అందరి సహకారంతో రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, కొలిమి ఉసేన్‌వలి, ఆలంసాగారి హనీప్, జెట్టి నాగరాజు, అమీర్, గఫార్, బషీర్, మాబులాల్, ఖాజా రసూల్, కింగ్ హుసేన్, ఇర్షాద్, జోహర్, అబ్దుల్లా, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ - దంపతులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పగిడ్యాల

ఆటో, మోటర్ సైకిల్ ఢీకొని వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం పగిడ్యాల గ్రామ సమీపాన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పగిడ్యాల గ్రామానికి చెందిన సవారి నాయుడు, భార్య స్వర్ణమ్మలు మోటర్ సైకిల్‌పై నందికొట్కూరుకు బయల్దేదారారు. పగిడ్యాల గ్రామ శివారులో ఉన్న పెట్రోలు బంకు సమీపంలోకి రాగానే నందికొట్కూరు నుండి వస్తున్న ఆటో బైక్‌ను ఢీ కొట్టింది. సవారి నాయుడు కు కాళ్ళు విరిగాయి. స్వర్ణమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి ఫోన్ చేయడంతో వారు వచ్చి చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


గాయాలతో రోడ్డు పక్కన పడి ఉన్న సవారి నాయుడు

ప్రజా ఆరోగ్య పరిరక్షణలో ఐఎంఎ కీలక పాత్ర

- ఐఎంఏ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సహజానంద ప్రసాద్ సింగ్
- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ రవికృష్ణ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - నంద్యాల

దేశ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఐఎంఎ కీలక పాత్ర వహిస్తూ, నిరంతరం కృషి చేస్తుందని ఐఎంఎ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సహజ నందా ప్రసాద్ సింగ్ పేర్కొన్నారు. శనివారం రాత్రి స్థానిక సౌజన్య ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఎపి 7వ రాష్ట్ర సదస్సులో ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ రవికృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఎంఎ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సహజానంద ప్రసాద్ సింగ్, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఐఎంఎ రానున్న సంవత్సర జాతీయ అధ్యక్షులు డాక్టర్ శరద్ అగర్వాల్, మాజీ అధ్యక్షులు డాక్టర్ జయాలాల్, ప్రపంచ మెడికల్ అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ రవివాన్ ఖెడ్ కర్, ఎపి మాజీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస రాజు పాల్గొన్నారు. డాక్టర్ రవికృష్ణతో పాటు జనరల్ సెక్రెటరీగా ఫణి ధర్, ఫైనాన్స్ సెక్రటరీగా రవీంద్ర, వచ్చే సంవత్సరానికి అధ్యక్షులుగా ఎన్నికైన డాక్టర్ జయ చంద్ర నాయుడు ఉపాధ్యక్షులుగా చక్రవర్తి, భూషణ్, మనో రంజన్ రెడ్డి, రసిక సంగ్వి, ఎంఎస్.శర్మ, సుబ్బారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలుగా హేమలత, కార్యదర్శిగా డాక్టర్ వసుధ, మిషన్ పింక్ విభాగం అధ్యక్ష కార్యదర్శులు దుర్గా రాణి, సౌజన్య, వైద్య విద్యార్థుల నెట్ వర్క్ చైర్మన్ డాక్టర్ కలేషా భాష, జూనియర్ డాక్టర్స్ నెట్ వర్క్ చైర్మన్‌గా డాక్టర్ కిరణ్, హాస్పిటల్ బోర్డ్ చైర్మన్గా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, జనరల్ ఫిజిషియన్ విభాగం డైరెక్టర్ గా డాక్టర్ పి. యస్. శర్మ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సహజ నందా ప్రసాద్ సింగ్ మాట్లాడుతూ ఈ సంస్థ సభ్యులు ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్సలు అందిస్తున్నారని అన్నారు. వైద్యులపై, ఆసుపత్రుల పై జరుగుతున్న హింసాత్మక సంఘటనలు నివారించడానికి కేంద్ర స్థాయిలో ఒక ప్రత్యేక చట్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ పోచా మాట్లాడుతు వైద్యుల సేవలు ప్రశంసనీయం అన్నారు. ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ నంద్యాలలో ఇంత పెద్ద స్థాయిలో వైద్య సదస్సు నిర్వహించడం నంద్యాలకు గర్వ కారణమన్నారు. నంద్యాలో, విజయవాడలో ఐఎంఎ భవన నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు. సదస్సులో నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్, వైజ్ఞానిక కమిటీ చైర్మన్ డాక్టర్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ రవికృష్ణను నిర్వాహక కమిటీ, రాష్ట్ర కమిటీ ఘనంగా సత్కరించారు.



రాష్ట్ర అధ్యక్ష పతకం డాక్టర్ రవి కృష్ణకు అందిస్తున్న జాతీయ నాయకులు సహజ ఆనంద ప్రసాద్, జయలాల్, రవి వాంకేట్కర్, శ్రీనివాస రాజు తదితరులు



రాష్ట్రస్థాయి సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు సహజ ఆనంద్ ప్రసాద్, నంద్యాల ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

23 వరకు ఆగ్నివీర్-వాయు ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

నంద్యాల కలెక్టరేట్ : భారత వాయుసేనలో ఆగ్నివీర్, వాయు ఉద్యోగాలకు https://agni-pathvayu.cdac.in వెబ్ సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా పురుషులు, మహిళా అభ్యర్థుల నుండి ఈ నెల 23 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు యువజన క్రీడల ముఖ్య కార్యనిర్వహణ అధికారి పివి.రమణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఇంటర్మీడియట్, డిప్లొమా పూర్తి చేసుకున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు.

నేటి నుండి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణం శాఖా గ్రంథాలయంలో నేటి నుండి 20వ తేదీ వరకు 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి రామచంద్ర తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖులను స్మరించడం, 17న స్వాతంత్ర్య సమరయోధుల ప్రసంగాలు, 18న విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది లాలయ్య పాల్గొన్నారు. **సంజామల :** సంజామలలోని గ్రంథాలయంలో 55వ గ్రంథాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి బాల తిమ్మారెడ్డి తెలిపారు. నేటి నుండి 20వ తేదీ వరకు వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



చాగలమర్రిలో మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి

శిరివెళ్ల : సిరివెళ్ల గ్రంథాలయ శాఖలో నేటి నుండి 20వ తేదీ వరకుగ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి చౌరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారోత్సవాలలో భాగంగా మహిళా దినోత్సవం, పుస్తక ప్రదర్శన, స్వాతంత్ర సమరయోధుల పోరాటం, ప్రముఖులకు సన్మానం, వ్యాసరచన, వక్తృత్వపు పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. **పగిడ్యాల :** నేటి నుండి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారిని కె.మద్దమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 55వ జాతీయ గ్రంథాయల వారోత్సవాలు ఈ నెల 14 నుండి 20వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక గ్రంథాలయ సభ్యత్వ నమోదు, అపరాధ రుసుం లేకుండా పుస్తకాలు స్వీకరించడం జరుగుతుందన్నారు.

మెరుగైన వైద్యానికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చేరిన వారికి మెరుగైన వైద్యం అందించడానికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. 16 మంది లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి ద్వారా మంజురైన రూ. 15 లక్షలు చెక్కులను ఎమ్మెల్యే ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలోని 16 మంది లబ్ధిదారులకు రూ. 15 లక్షలు సిఎం సహాయనిధి ద్వారా మంజూరయినట్లు చెప్పారు. రాష్ట్రంలో వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు సిఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతనందిస్తున్నట్లు తెలిపారు.


సిఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే



జగనన్న క్రీడా సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

జగనన్న క్రీడా సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

జగనన్న క్రీడా సంబరాల పోస్టర్‌ను స్థానిక వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని డిసెంబర్ 21వ తేదీన జగనన్న క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీయాలన్న లక్ష్యంతో ఈ నెల 15న ఉదయం 9 గంటలకు పాల సాగరం జడ్పిహెచ్ఎస్ స్కూల్ గ్రౌండ్ నందు నియోజకవర్గస్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. అనంతరం జిల్లా క్రీడల అధికారి రాజు మాట్లాడుతూ వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ (బాలురు) విభాగాల్లో 18 సంవత్సరాలు పైబడిన యువతీ యువకులకు ఎంపిక జరుగుతుందన్నారు. అనంతరం జట్లను జిల్లా స్థాయికి పంపిస్తామన్నారు. క్రీడల్లో పాల్గొనేవారు జగనన్న స్పోర్ట్స్ క్లబ్ యాప్‌లో రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. ప్రతి క్రీడాకారుడు ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9440826252, 9490403753 నెంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఏ.శ్రీనివాసరెడ్డి, ఆళ్లగడ్డ మండల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో కనీస వసతులు కరువు

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం మండలంలోని పలు గ్రామాలలో చేపట్టిన జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేవనిజనసేన పార్టీ పాణ్యం ఇంచార్జి చింతా సురేష్ బాబు పేర్కొన్నారు. జగనన్న కాలనీల సోషల్ ఆడిట్ లో భాగంగా ఆదివారం మండలంలోని కౌలూరు, బలపనూరు, కొండ జుటురు, కొనిదేడు, గోనవరం తదితర గ్రామాల్లో జగనన్న కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాలు కాలయాపన చేసి పేదవాడి గూడు కూడా నిర్మించ లేని వాళ్ళ వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానులు నిర్మిస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. కాలనీలలో రహదారులు కూడా సరిగా లేవని, ఇలాంటి చోట నిర్మాణాలు ఎలా సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు జగదీష్ బాబు, మంజునాథ, సుధాకర్, షబ్బీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** బనగానపల్లె పట్టణంలో జగనన్న ఇండ్లు కనిపించడం లేదని జనసేన పార్టీ నాయకులు భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో పేద ప్రజలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను జనసేన పార్టీ నాయకులు పరిశీలించారు. నాయకులు పెద్దయ్య, పద్వి, అజిత్ రెడ్డి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

అనధికారికంగా ఆర్‌టిసి బస్సులు పార్కింగ్

- బస్టాండ్‌ను తలపిస్తున్న ఆబీద్ డాబా
- కల్తీ ఆహారం పెడుతూ దోచుకుంటున్న యాజమాన్యం
- సిట్టింగ్‌కు, వాహన ప్రమాదాలకు నిలయంగా మారిన వైనం

ప్రజాశక్తి - శిరివెళ్ల

శిరివెళ్ల మండల కేంద్రంలోని 40వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఆబీద్ డాబా హెూటల్ ప్రతి రోజు అనధికార ఆర్టీసీ బస్టాండ్‌ను తలపిస్తోంది. 40వ జాతీయ రహదారి ఎక్స్‌ప్రెస్ హైవే అయినప్పటికీ కొన్ని ఆర్టీసీ బస్సులు రాంగ్ రూట్‌లో ఆబీద్ డాబాకు వచ్చి భోజనాలకు అంటూ నిలుపుతున్నారు. ఇదే అదనుగా డాబా యాజమాన్యం ప్రయాణికులకు కల్తీ ఆహారం పెడుతూ దోచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పప్పులో నీరు పోయడం, సేర్వాలో రసం కలపడం, పెరుగులో ట్యాప్ వాటర్ కల్తీ చేయడం, బిర్యానీ మాటలతో చెప్పలేని చికెన్‌తో వండి వడ్డిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుండి మూడు గంటలలోపు డాబా హెూటల్ ఎదురుగా ఆర్టీసీ బస్సులు అనధికారికంగా పార్కు చేసి ఉంటాయని, భోజన సమయం పాటించకుండా ఇష్టానుసారంగా పార్క్ చేసి పెడుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల వైపు నుండి కడప వెళ్లే బస్సులు రాంగ్ రూట్లో వెళ్లి పార్కు చేసి తిరిగి రాంగ్ రూట్లోనే డివైడర్ వద్ద దాటుకుని వెళుతున్నట్లు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డాబా హెూటల్ బయట కూల్ డ్రింక్ షాప్‌లో మందు బాబులకు సిట్టింగ్ సౌకర్యం కల్పించి, హోటల్లో కల్తీ ఆహారాన్ని యదేచ్ఛగా వండిస్తున్నారన్న అనుమానాలు, విమర్శలు అధికమయ్యాయి. సంబంధిత పోలీస్ అధికారులు, ఫుడ్ కంట్రోల్, కల్తీ నిరోధక శాఖ అధికారులు స్పందించి డాబా హోటల్‌ను తనిఖీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

ఆబీద్ డాబా హోటల్





ఆబీద్ డాబా హోటల్ వద్దకు రాంగ్ రూట్‌లో వస్తున్న ఆర్‌టిసి బస్సు

పవన్ చంద్రబాబు దత్తపుత్రుడు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

చంద్రబాబు దత్తపుత్రుడు, ప్యాకేజ్ స్టార్ పవన్ కళ్యాణ్ అని, కుళ్లు, కుతంత్ర రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో సిఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న అవినీతి రహిత, ప్రజాహిత పారదర్శక సంక్షేమ అభివృద్ధి పాలనను చూసి ఓర్వలేక చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ కుటిల రాజకీయాలు చేయడం సరి కాదని పలికారు. చంద్రబాబు నాయుడు ఉస్కో అంటే పవన్ కళ్యాణ్ పరుగులు పెడుతూ ఒక జెండా, అజెండా లేకుండా నటిస్తున్నాడని విమర్శించారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వైజాగ్, నంద్యాలలో పేదలకు ఇళ్లను ఏర్పాటు చేయకుండా టిడిపి నేతలు కోర్టులకు వెళ్లి అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని, ఇదేనా చంద్రబాబుకు ప్రజలపై ఉన్న వైఖరని ఎమ్మెల్యే ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడుకు చిత్తశుద్ధి ఉంటే కోర్టుకు వెళ్లిన వారిని కేసులు ఉపసంహరించుకునేలా చూడాలన్నారు. పర్యావరణం దెబ్బతింటుందంటూ కోర్టుకు వెళ్లారని, అయితే కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందన్నారు. త్వరలోనే పేదల కల నెరవేరుతుందని అన్నారు. టిడిపి వేసిన మూడు కేసులలో ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చొరవతో రెండు కేసులలో గెలిచామన్నారు. దీనినిబట్టి న్యాయం ఎవరి వైపు ఉందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. నంద్యాలలో 10 లక్షల విలువైన స్థలంలో 7 వేల ఇళ్లను కేవలం ఒక్క రూపాయితోనే పేద ప్రజలకు అందిస్తున్న ఘనత తమదేనన్నారు. సమావేశంలో నంద్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ షావాలి, కో ఆప్షన్ సభ్యులు సలాం ముల్ల, నాయకులు పున్న శేషయ్య, జాకీర్ హుషేన్, అమృతరాజ్, పార్థుడు, అడ్వకేట్ ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విప్ గంగుల

జగనన్న కాలనీల్లో అవినీతికి ఆస్కారమే లేదు

- ప్రతిపక్షాలు రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలి
- మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి

ఆళ్లగడ్డ : జగనన్న కాలనీలలో అవినీతి జరిగిందని పవన్ కళ్యాణ్ అర్థం పర్థం లేని విమర్శలు చేస్తున్నారని, అయితే అవినీతికి ఆస్కారమే లేదని శాసనమండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టనంలోని స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశ ప్రధాని విశాఖపట్నం వచ్చి పలు ప్రాజెక్టులను శంకుస్థాపన చేయడం హర్షనీయమన్నారు. ఆ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో రాష్ట్ర అభివృద్ధి తమ ధ్యేయమని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారన్నారు. రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతూ ఉంటే టిడిపి, జనసేన పార్టీలు అభివృద్ధిపై రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. వారికి కనువిప్పు కలగకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర అభివృద్ధికి టిడిపి, జనసేన పార్టీలు సహకరించాలన్నారు. ఇప్పటంలో ఏదో జరిగిందన్నట్లు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దాడికి వెళుతున్నట్లుగా వెళ్లడం జరిగిందన్నారు. రాజకీయంగా ఎవరు మాట్లాడని భాషను జనసేన అధినేత మాట్లాడడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో తేల్చుకొని స్థితిలో టిడిపి, జనసేనలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు రాష్ట్రంలో జరుగుతున్న అభివద్ధికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, వైసిపి నాయకులు సుబ్బారెడ్డి, నజీర్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల విజేత 'పశ్చిమగోదావరి'

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని ఎద్దుల పాపమ్మ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 12, 13వ తేదీలలో 26వ జూనియర్స్ సెపతక్రా రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీలలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బాల,బాలికలు మొదటి స్థానం సాధించారు. అలాగే బాలుర విభాగంలో గుంటూరు జిల్లా రెండవ స్థానం, కర్నూలు, ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన బాలురు మూడో స్థానం సాధించారు. బాలికల విభాగంలో ప్రకాశం జిల్లా విద్యార్థినిలు రెండవ స్థానం,కర్నూలు, శ్రీకాకుళం జిల్లా చెందిన బాలికలు మూడోస్థానం సాధించారు. కార్యక్రమంలో నాగాపురం నరసింహం, జిల్లా చైర్మన్ ప్రజ్ఞ నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శేఖర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు రవి, శేషు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, బాబు, దేవేంద్ర, ప్రతాప్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.



విజేత కప్‌ను అందుకుంటున్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన బాల, బాలికలు

డిఎస్‌పి కార్యాలయంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని డిఎస్పి కార్యాలయంలో సబ్ డివిజన్ పోలీస్ అధికారి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. పలు కారణాలతో విడిపోయిన జంటలను పిలిపించి న్యాయవాదుల సమక్షంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించి వారిని ఒకటి చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ డిఐజి, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ కట్టుదిట్టంగా అమలు చేస్తామన్నారు. కుటుంబ కలహాల వల్ల వల్ల ఎన్నో కాపురాలు ఇబ్బంది పడుతున్న పరిస్థితులలో వారి కాపురాలు చక్కదిద్ది తిరిగి జీవితం కొనసాగించేందుకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు టిఎంసి వేణుగోపాల్, అమీర్ భాష, న్యాయవాదులు సోమశేఖర్ రెడ్డి, సరిత, రమాదేవి, టౌన్ ఎస్ఐ తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

15న వాహనాలు వేలం

అవుకు : అవుకు పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ కేసులలో సీజ్ చేసిన మోటర్ వాహనాలను ఈ నెల 15న వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, డోన్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన మోటార్ సైకిల్ 70, ఒక సుమో, ఒక ఆటో మొత్తం 72 వాహనాలను ఈనెల 15న అవుకు పోలీస్ స్టేషన్ నందు వేలంపాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే బనగానపల్లె పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో సీజ్ చేసిన 15 మోటార్ సైకిల్లు, ఒక కారు, ఒక మహేంద్ర బొలెరో, మూడు ఆటోలు మొత్తం 20 వాహనాలకు కూడా అవుకు పోలీస్ స్టేషన్ నందు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

రుద్రవరం : మండలంలోని హరినగరం గ్రామానికి చెందిన నారాయణ (32) పాముకాటుకు గురై మృతి చెందినట్లు ఎస్సై నిరంజన్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ నారాయణ ఈనెల 9న మొక్కజొన్న పొలం దగ్గరకు వెళ్లి పొలంకు నీళ్లు పెడుతుండగా పాము కాటు వేసిందన్నారు. దీంతో అతన్ని బంధువులు చికిత్స నిమిత్తం108 వాహనం ద్వారా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. అక్కడ కోలుకోలేక మతి చెందాడన్నారు. మృతుడి తల్లి బాలనాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి డోన్ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి, ఇతర నాయకులు

రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

- డోన్ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమవుతుందని, భవిష్యత్తులో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతో ఉందని ఆ పార్టీ డోన్ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బేతంచర్లలోని హనుమాన్ నగర్ కాలనీలో పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మురళి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందిందంటే వైఎస్ఆర్సిపి ప్రభుత్వం డీజిల్ పెట్రోల్ పన్నులు, నిత్యవసర సరుకులు ధరలు పెంచి సామాన్యులకు అందుబాటులో లేకుండా చేయడమేనా అని వైసిపి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వం నవరత్నాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి పరిపాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. నారా చంద్రబాబు నాయుడును రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేయాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉన్నం చంద్రశేఖర్ చౌదరి, గోవింద్ రెడ్డి, భీమారెడ్డి, అడ్వకేట్ హారున్, శ్రీనివాస్ గౌడ్, రామ్మూర్తి, గుటిపల్లి ముల్లా, సురేష్, రామకృష్ణ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో కోటేష్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నంద్యాల

జాతీయ స్థాయి చిత్రకళ ప్రదర్శనలో నంద్యాలకు చెందిన కోటేష్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు అత్యంత ప్రతిభ చూపి గోల్డ్ మెడల్స్ సాధించారు. విజేతలను నంద్యాల ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ కోటేష్ మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలోని చోడవరంలోని చోడవరం చిత్రకళానికేతన్ వారు బాలల దినోత్సవ సందర్భంగా ఈ నెల 6వ తేదీ నిర్వహించిన జాతీయ పోటీల్లో తమ అకాడమీ విద్యార్థులు 24 మంది పాల్గొనగా 20 మంది బహుమతులు సాధించారని చెప్పారు. 5వ తరగతి విద్యార్థి సాయి హరీష్ చైల్డ్ మెగా అవార్డు కింద గోల్డ్ మెడల్, మెమంటో, నగదు బహుమతి అందుకున్నారని తెలిపారు. అకాడమీ విద్యార్థులు లాస్యశ్రీ, హారిక, మధురిమ అస్మిత, లిఖిత, మాన్యశ్రీ, నిఖిల్, వాసంతి, రిషిత, నాగనిరూప, శ్రేష్ఠ, సాయి భవతి, హేమకేశ్, మంజునాథ్, ఉమేష్ గుప్తా, సాహిత్, అనన్య, నాగశేష శయన్, నందిని విజేతలుగా నిలిచి మెడల్స్ సాధించారన్నారు.



విజేతలైన విద్యార్థులను అభినదిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహ ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుండి జిఎం టాకీస్ వరకు ఫోర్‌లైన్ రోడ్డు వెడల్పు అనంతరం శ్రీకష్ణదేవరాయలు విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కాశయ్య తోటలో శ్రీ కృష్ణ దేవరాయ మండల బలిజ సేవ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన మహెూత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. బలిజ సంఘీయులందరూ కలిసిమెలిసి సంఘాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. బలిజ సంఘీయుల కోరిక మేరకు పట్టణంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బలిజ సంఘం మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, బానుముక్కల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు నీలి శ్రీనివాసులు, సంఘం నాయకులు సూర రామసుబ్బయ్య, నీలి పుల్లన్న, సురా కిషోర్ కుమార్ నామాల మహేష్, రామకృష్ణాపురం రవి, పలుకూరు సురేష్, చెరువుపల్లి సూర్యనారాయణ రెడ్డి, గోవిందన్నె వెంకటయ్య, శంకర్ రెడ్డి, కొత్తపేట తోకల నారాయణ ,సాదుకోట వెంకటేశ్వర్లు, బీరువోలు గురువిరెడ్డి, కూరాకుల సుబ్బారెడ్డి, మధు, ఎయిర్టెల్ మనోహర్, ఆర్కియాలజీ శ్రీనివాసులు, జీవీ కృష్ణ, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అంతర్జాతీయ పోటీలకు ఆళ్లగడ్డ విద్యార్థి

- అభినందించిన ఎమ్మెల్యే గంగుల

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని రామలక్ష్మి కొట్టాలకు చెందిన విద్యార్థి పగడాల బయన్న జంప్ రోప్ క్రీడల్లో జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరచి అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. విద్యార్థినిని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆదివారం అభినందించారు. అనంతరం క్రీడాకారుడు బయన్నకు ప్రోత్సాహంగా రూ.15 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ జంప్ రోప్ పోటీలలో అంతర్జాతీయ స్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబరిచి ఆళ్లగడ్డకు పేరు తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలు పట్ల ఆసక్తి కనబరచాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, గంగుల రామిరెడ్డి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిసిన డిఎస్‌పి

నంద్యాల కలెక్టరేట్ : ఆళ్లగడ్డ డిఎస్పిగా బాధ్యతలు చేపట్టిన ఐ.సుధాకర్ రెడ్డి జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డిని ఆదివారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. 1995 బ్యాచ్‌కి చెందిన సుధాకర్ రెడ్డి నందికొట్కూరు ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఆళ్ళగడ్డ సబ్ డివిజన్ లో సంజామల, చాగలమర్రి, ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ స్టేషన్లలో ఎస్సైగా పని చేశారు. 2007లో సిఐగా పదోన్నతి పొంది 2012 నుండి 2014లో ఆళ్లగడ్డలో సిఐగా పని చేశారు. 2020న డిఎస్‌పిగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగంలో డిఎస్‌పిగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆళ్లగడ్డ సబ్ డివిజన్ డిఎస్‌పిగా ఐ.సుధాకర్ రెడ్డి బదిలీ అయ్యారు.



ఎస్‌పికి పుష్పగుచ్చం అందజేస్తున్న ఆళ్లగడ్డ డిఎస్‌పి సుధాకర్ రెడ్డి

ప్రముఖ పారిశ్రామికవేత్త కంకర గుర్రెడ్డి మృతి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే కాటసాని, మాజీ ఎమ్మెల్యే బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని యాగంటి పల్లె గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, కెజిఆర్ విద్యా సంస్థల చైర్మన్ కంకర గురెడ్డి(84) ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డిలు యాగంటిపల్లెకు చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ఇంటర్,డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసి ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌కు కంకర గురెడ్డి బాటలు వేశారని తెలిపారు. కంకర గురెడ్డి ఎన్నో సంవత్సరాల నుంచి తమకు ఎంతో సుపరిచితుడని, ఇలాంటి వ్యక్తి మతి చెందడం చాలా బాధాకరమన్నారు. మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషి చేసిన కంకర గుర్రెడ్డి మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, ప్రసాద్ రెడ్డి కళాధర్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి ,పుల్లారెడ్డి, రామ సుధాకర్ రెడ్డి, టిడిపి నాయకులు, గ్రామ ఉపసర్పంచి బండి మౌళేశ్వర రెడ్డి, తపాలా పెద్ద దస్తగిరి, మహేశ్వర రెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



నివాళ్లులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

- మహాశివరాత్రిని తలపించిన రద్దీ
- కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ - ఇబ్బందులు పడ్డ భక్తులు

ప్రజాశక్తి - శ్రీశైలం

కార్తీక మాసం పురస్కరించుకొని శ్రీశైలం క్షేత్రానికి ఆదివారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. క్షేత్రం ఆవరణం మహాశివరాత్రిని తలపించింది. కార్తీక శోభతో శ్రీశైలం క్షేత్రం భక్తులతో కళకళలాడుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఉండే కాక ఇతర రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాలలో, బస్సులలో శ్రీశైలం చేరుకున్నారు. అధిక సంఖ్యలో భక్తుల రాకపోకలను గమనించిన తెలంగాణ రాష్ట్రం అటవీశాఖ చెక్ పోస్టులకు 24 గంటలు అనుమతిని ఇచ్చింది. ఇది గమనించిన భక్తులు మరింత సంఖ్యలో శ్రీశైలం చేరుకొని పాతాళ గంగలో స్నానాలు ఆచరించి తెల్లవారుజాము నుండి స్వామి అమ్మ వార్లను దర్శించుకునేందుకు క్యూలైన్లో వేచి ఉన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు తెల్లవారుజామున 4 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు దర్శనం ఏర్పాటు చేశారు. ఆర్జిత అభిషేకాలు, గర్భాలయ అభిషేకాలు రద్దు చేశారు. పరిపాలన భవనం సిబ్బందికి ప్రత్యేక డ్యూటీలు కేటాయించారు. క్యూలైన్లో ఉన్న భక్తులకు అల్పాహారం, మంచినీరు ఏర్పాటు చేశారు. భక్తులకు కార్తీక దీపాలు వెలిగించుకునేందుకు గంగాధర మండపం ఉత్తరం మాడ వీధి ఏర్పాటు చేశారు. అన్నపూర్ణ భవనంలో 10:30 గంటల నుండి మూడు గంటల వరకు, సాయంత్రం 6 నుండి 8 వరకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఇఒ లవన్న ప్రధాన కూడలిలో ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

అటవీ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్

రెండవ శనివారం, ఆదివారం సెలవు దినాలు కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలం చేరుకుంటుండడంతో మార్గమధ్య అటవీ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ అయింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు, చంటి పిల్లల తల్లులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శ్రీశైలం చేరుకున్న భక్తులకు గదులు దొరకక, వసతి సౌకర్యం లేక రాత్రి అనేక ఇబ్బందులు పడ్డారు. అయినప్పటికీ భక్తులు లెక్కచేయకుండా పాతాళగంగలో స్నానాలు ఆచరించి స్వామి అమ్మ వార్లను దర్శించుకున్నారు.

భక్తులతో కిటకిటలాడిన కొత్తూరు క్షేత్రం

పాణ్యం : పాణ్యం మండలంలోని కొత్తూరు సుబ్బారాయుని స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం కావడంతో ఉదయం నుండే భక్తులు స్వామి వారిని దర్శించుకోవాలని క్యూ లైన్‌లలో వేచి వున్నారు. ఒకవైపు అభిషేకాలు, ఇంకోవైపు దర్శనం కోసం భక్తులు ఎగబడ్డారు. దేవస్థాన అధికారులు, సిబ్బంది భక్తులకు తగిన సూచనలు అందిస్తూ దర్శనం కల్పించారు. ఇఒ రామకృష్ణ, ప్రధాన అర్చకులు వీరయ్య స్వామి, నారయణ స్వామి, కిట్టయ్య స్వామి, సురేష్ శర్మ, సిబ్బంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు సుబ్బరాయుడు క్షేత్రంలో భక్తులు



పాతాళగంగలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం